www.prajanaava.in

Telugu Daily

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 08 | వెల : 5.00

ప్రజానావ

పాఠక మహాశయులకు విజ్ఞప్తి

తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!

వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

☎ : 99484 33277 / 7288825681

Published from: Karimnagar, Circulated to: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

హైదరాబాద్ | సంపుటి : 2 | సంచిక : 69 | గురువారం | 22 ఆగస్టు 2024



జమ్మూ కశ్మీర్ ఎన్నికల ఇన్‌చార్జీలుగా

కిషన్ రెడ్డి, రాంమాధవ్

2 లో..

# స్టే ఇవ్వలేం

## జన్వాడ ఫామ్‌హౌస్ కూల్చివేతపై హైకోర్టు స్పష్టీకరణ

- పదేళ్ల తర్వాత ఇప్పుడెందుకు కూల్చాలనుకుంటున్నారు?
- ఇన్నేళ్లుగా అధికారులకు ఎఫ్‌టీఎల్ గుర్తుకు రాలేదా?
- ప్రశ్నల వర్షం కురిపించిన ఉన్నత న్యాయస్థానం
- హైడ్రాపై పరిధిపైనా ఆరా
- నిబంధనల ప్రకారం ముందుకెళ్లాలని సూచన



**హైదరాబాద్ బ్యూరో, ప్రజానావ:**

జన్వాడ ఫామ్‌హౌస్ కూల్చవద్దంటూ ఆ ఫామ్‌హౌస్ యజమాని ప్రదీప్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో బుధవారం విచారణ జరిగింది. ఫామ్‌హౌస్ కూల్చివేయకుండా స్టే ఇవ్వలేమని స్పష్టం చేసింది. నిబంధనల ప్రకారం ముందుకు వెళ్లాలని సూచించింది. వాదనల సందర్భంగా హైడ్రాకు ఉన్న పరిధి గురించి చెప్పాలని ఏఏజీని ధర్మాసనం కోరింది. అంతేగాక కూల్చివేతలపై హైడ్రా దృష్టి సారించాల్సిన అవసరం ఉందని హైకోర్టు అభిప్రాయ పడింది. ఇప్పటివరకు హైడ్రా ఎన్ని కట్టడాలు కూల్చివేసింది..? ప్రతి కూల్చివేతలోనూ నిబంధనలు పాటించారా.. లేదా..? అనే వివరాలు ఇవ్వాలని ఏఏజీని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. చెరువుల ఎఫ్టీఎల్ పరిధిని నిర్ణయించారా..? అని ప్రశ్నించింది. హైదరాబాద్ రోజురోజు కూ అభివృద్ధి చెందుతోందని, ఆక్రమణలు ఎక్కువయ్యాయని ఏఏజీ కోర్టు దృష్టికి తెచ్చారు. ప్రభుత్వ భూములు, చెరువులను రక్షిండానికే హైడ్రా ఆక్రమణలకు గురవుతున్న ప్రభుత్వ భూ ములు, పార్కులు, చెరువులను రక్షించడానికి హైడ్రా ఏర్పాటు చేసినట్టు చెప్పారు. స్థానిక సంస్థలతో సమన్వయం చేసుకొని హైడ్రా పనిచేస్తుందని తెలిపారు. స్థానిక సంస్థల ద్వారా నోటీ సులు ఇచ్చిన తర్వాతే అక్రమ కట్టడాలు కూల్చివేస్తున్నామని చె ప్పారు. ఈ పిటిషన్‌కు విచారణర్హత లేదని, కొట్టివేయాలని కో రారు. కాగా 2014లో జన్వాడలో ఫామ్‌హౌస్ ఏర్పాటు చేశా రని, 2019లో ప్రదీప్ రెడ్డి ఫామ్‌హౌస్‌ను కొనుగోలు చేశారని పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. అయితే, పదేళ్ల తర్వాత ఇప్పుడు ఫామ్‌హౌస్ ఎందుకు కూల్చాలనుకుంటున్నారు? ఇన్నేళ్లుగా అధికారులకు ఎఫ్‌టీఎల్ గుర్తుకు రాలేదా అని ఈ సందర్భంగా హైకోర్టు ప్రశ్నించింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చెరువుల ఎఫ్‌టీఎల్ ను నోటిఫై చేస్తే ఆ వివరాలు ఇవ్వాలని కోర్టు కోరింది. దాంతో ప్రాథమికంగా నోటిఫై చేశామని, తుది నివేదిక రూపొందించే పనిలో ఉన్నామని ఏఏజీ తెలిపారు. జన్వాడ ఫామ్‌హౌస్ ఎఫ్‌టీఎల్‌కు సంబంధించిన వివరాలు కూడా సమర్పించాలని హైకోర్టు ఆదేశించింది.



## ఇక పంచాయతీపై నజర్

- ఓటరు జాబితా తయారీకి షెడ్యూల్ ఖరారు చేసిన ఈసీ
- సెప్టెంబర్ 21న తుది జాబితా ప్రకటన

**ఖైరతాబాద్, ప్రజానావ:**

పంచాయతీ ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు ప్రారంభించింది. సెప్టెంబరు 6 నుంచి వార్డులవారీగా ఓటరు జాబితా తయారీ ప్రక్రియ చేపట్టాలని నిర్ణయించింది. కేంద్ర ఎన్నికల సంఘం నుంచి ఓటరు జాబితా రావడంతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి పంచాయతీ రాజ్ శాఖ ఉన్నతాధికారులతో సమీక్షించారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఓటరు జాబితా తయారీకి షెడ్యూల్ ఖరారు చేశారు. సెప్టెంబరు 6న పంచాయతీలు, వార్డుల వారీగా ముసాయిదా ఓటరు జాబితా ప్రచురిస్తారు. సెప్టెంబరు 7 నుంచి 13 వరకు అభ్యంతరాలు స్వీకరించి అదే నెల 21న తుది జాబితా ప్రకటిస్తారు. సెప్టెంబరు 9, 10న రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి సూచనలు స్వీకరిస్తారు. ఓటరు జాబితా తయారీపై ఈనెల 29వ తేదీ ఉదయం 11.30 గంటలకు కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా పంచాయతీ అధికారులతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు.



# ఆ ఫామ్‌హౌస్ నా దోస్తుది

- నాకెలాంటి ఫామ్‌హౌస్ లేదు
- మీరన్నట్టు అది ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉంటే నేనే కూలగొట్టిస్తా
- మరి చెరువుల్లో కట్టుకున్న మంత్రుల ఫామ్‌హౌస్‌ల సంగతేంటి?
- వాటిని కూలగొట్టే దమ్ము హైడ్రాకు లేదా?
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్ బ్యూరో, ప్రజానావ:**

బఫర్ జోన్‌లో కానీ, ఎఫ్‌టీఎల్‌లో కానీ నాకు ఎలాంటి ఫామ్‌హౌస్ లేదు.. మీరు చెప్తున్న ఆ ఫామ్‌హౌస్ నా స్నేహితుడిది అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. తన స్నేహితుడి ఫామ్ హౌస్ ఎఫ్‌టీఎల్ లేదా బఫర్ జోన్లో ఉంటే నేనే దగ్గర్నుండి కూలగొట్టిస్తా. నో ప్రాబ్లం.. మంచి జరుగుతున్నప్పుడు అందరం ఆహ్వానించాల్సిందే. కానీ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఒక్కటే అడుగుతున్నాను. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో మంత్రులు, పెద్ద పెద్ద కాంగ్రెస్ నేతలు కట్టిన రాజభవనాల సంగతి ఏంది..? నా స్నేహితుడి ఫామ్‌హౌస్‌ను మరి జూమ్‌లో పెట్టి తీస్తున్నారు.. అవి సోషల్ మీడియాలో కనబడుతున్నాయి. కానీ చెరువుల్లో కట్టుకున్న మంత్రుల ఫామ్‌హౌస్‌ల సంగతి ఏంది..? చెరువుల్లో కట్టుకున్న బడా కాంగ్రెస్ నాయకుల ఫామ్‌హౌస్‌లు కూలగొట్టే దమ్ము హైడ్రాకు లేదా..? అని కేటీఆర్ ప్రశ్నించారు. అన్నీ ఒక్కటే రోజు కూలగొడదాం ఎఫ్‌టీఎల్ పరిధిలో కట్టుకున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కేవీపీ రామచంద్రరావు, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, కౌన్సిల్ చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మధుయాష్కీ వీళ్లందరి ఫామ్‌హౌస్‌ల దగ్గరికి వెళ్లి కూలగొడదాం. వీరితో పాటు రేవంత్ రెడ్డిది కూడా ఫామ్ హౌస్ ఉంది. సీఎం ఫామ్ హౌస్ గురించి శాటిలైట్ మ్యాప్‌లను కూడా మీడియాకు పంపిస్తాను చూసుకోండి. నా పేరు మీద ఫామ్‌హౌస్ ఉన్నట్లు మీడియాలో ఏవేవో కథనాలు రాస్తున్నారు. కానీ స్పష్టంగా చెబుతున్నా.. నా పేరు మీద ఏ ప్రాపర్టీ

మిగతా 2 లో



# స్పీడ్ పెంచండి

## ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణ భాగంలో త్వరితగతిన భూసేకరణ చేపట్టండి

- భూసేకరణ పనుల పురోగతిని రోజువారీగా సీఎస్ వివరించాలి
- రైతులకు న్యాయం జరిగేలా పారదర్శకత పాటించండి
- భవిష్యత్ అవసరాలకు అనుగుణంగానే అలైన్మెంట్ ఉండాలి
- ఆర్‌ఆర్‌ఆర్ ప్రగతిపై సీఎం రేవంత్ ఉన్నతస్థాయి సమీక్ష

**హైదరాబాద్ బ్యూరో, ప్రజానావ:** తెలంగాణ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా చేపట్టిన రీజినల్ రింగ్ రోడ్డు దక్షిణ భాగం భూసేకరణ పనుల్లో వేగం పెంచాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. రీజినల్ రింగ్ రోడ్డుకు సంబంధించి భూసేకరణ పనుల పురోగతిపై ముఖ్యమంత్రి బుధవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు. భూములిచ్చే రైతులకు న్యాయం చేస్తూ ఆర్‌ఆర్‌ఆర్ భూసేకరణ పూర్తి పారదర్శకంగా జరగాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆర్‌ఆర్‌ఆర్ నిర్మాణ పనుల్లో పురోగతిపై సంబంధిత కలెక్టర్లు ఇకపై రోజూవారీగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వివరించాలని సీఎం పేర్కొన్నారు. అర్బన్ తెలంగాణ, రూరల్ తెలంగాణ సమగ్రాభివృద్ధి లక్ష్యంగా ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్‌ఆర్), రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) మధ్య అనుసంధానానికి అనువుగా రహదారుల ప్రణాళికలు ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ప్రధాన రహదారులకు అనుసంధానం చేసే ప్రదేశాలను ముందుగానే గుర్తించి నిరంతరం సాఫీగా ప్రయాణాలు సాగేందుకు వీలుగా నిర్మాణాలు ఉండాలని సీఎం అన్నారు. భవిష్యత్తు అవసరాలే ప్రాతిపదికగా ఆర్‌ఆర్‌ఆర్ అలైన్మెంట్ ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ఫ్యూచర్‌సిటీకి ఉపయోగంగా ప్రణాళికలు ఫ్యూచర్ సిటీలో ఏర్పాటు కానున్న వివిధ రకాల పరిశ్రమలు, సంస్థలకు ఉపయోగకరంగా ఈ రోడ్ల ప్రణాళికలు ఉండాలని స్పష్టం చేశారు. ఆర్‌ఆర్‌ఆర్ కింద ఉత్తర భాగం సంగారెడ్డి – భువనగిరి – చౌటుప్పల్ మార్గంలో భూసేకరణ దాదాపుగా పూర్తి కాగా, ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణ భాగంలోని (చౌటుప్పల్–ఆమన్గల్–షాద్ నగర్ –సంగారెడ్డి (189.20 కి.మీ.) మార్గానికి సంబంధించి భూ సేకరణ, అలైన్మెంట్ అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆ సూచనలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో పర్యటించి సమగ్ర నివేదిక తయారు చేసి త్వరగా అందజేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఆర్‌ఆర్‌ఆర్ విషయంలో

మిగతా 2 లో

# పోలెండ్‌లో అడుగుపెట్టిన మోడీ

- 45 ఏళ్లలో భారత ఇక్కడ పర్యటించడం ఇదే తొలిసారి
- వ్యాపార దిగ్గజాలు, పర్యావరణవేత్తలతోనూ చర్చలు జరపనున్న భారత ప్రధాని
- ఘన స్వాగతం పలికిన ప్రవాసులు

2 లో..





## ఫార్మా కంపెనీలో

# ఘోర ప్రమాదం

- భోజన విరామ సమయంలో పేలిన రియాక్టర్
- 16మంది దుర్మరణం, 50మందికిపైగా గాయాలు
- మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం
- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు
- తక్షణ చర్యలకు ఆదేశం

2 లో..



# ఫార్మా కంపెనీలో ఘోర ప్రమాదం

- భోజన విరామ సమయంలో పేలిన రియాక్టర్
- 16మంది దుర్మరణం, 50మందికిపైగా గాయాలు
- మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం
- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు
- తక్షణ చర్యలకు ఆదేశం






**హైదరాబాద్ బ్యూరో, ప్రజానావ:** ఏపీలోని అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం అచ్యుతాపురం ఫార్మా సెజ్లోని ఎసైన్షియా ఫార్మా కంపెనీలో ఘోర ప్రమాదం జరిగింది. రియాక్టర్ పేలిన ఘటనలో ఇప్పటివరకు 16 మంది మృతి చెందినట్లు తెలిసింది. మరో 50 మందికి పైగా గాయపడ్డారు. గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాద తీవ్రతను బట్టి మృతుల సంఖ్య పెరిగే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. పేలుడు ధాటికి మృతదేహాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. బాధితుల్లో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. రియాక్టర్ పేలుడు ధాటికి పరిశ్రమ భవనం దెబ్బతింది. శిథిలాల కింద పలువురు చిక్కుకుని ఉంటారని భావించి.. ఎసెన్షియా ఫార్మా కంపెనీలో 3 ఎన్డీఆర్ఎఫ్ బృందాల రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. శిథిలాల తొలగింపు కోసం భారీ క్రేన్లను అధికారులు తెప్పించారు. కొన్ని గంటలుగా రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది. అంబులెన్సుల్లో మృతదేహాలు, బాధితులను తరలిస్తున్నారు. శిథిలాల తొలగింపు పూర్తయితే కానీ మృతులు, క్షతగాత్రుల సంఖ్య తేల్చ లేని పరిస్థితిలో అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది. కుప్పకూలిన పరిశ్రమ శిథిలాల కింద కార్మికులు నుజ్జునుజ్జయ్యారు. 33మంది ప్రభావానికి గురయ్యారని అధికారులు ప్రకటించారు. ఎసెన్షియా ఫార్మా కంపెనీలో వందల సంఖ్యలో కార్మికులు, సిబ్బంది పని చేస్తున్నారు. భోజన విరామ సమయంలో భారీ పేలుడు సంభవించి మంటలు చెలరేగాయి. దట్టంగా పొగ అలుముకొని ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. కార్మికులు ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. భారీ శబ్దంతో సమీప గ్రామాల ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. మొత్తం 12 అగ్నిమాపక వాహనాలు వచ్చి మంటలను అదుపుచేశాయి. అచ్యుతాపురం సెజ్లో ప్రమాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రియాక్టర్ పేలుడు ఘటనపై కలెక్టర్తో మాట్లాడారు. తక్షణం సహాయ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అచ్యుతాపురం సెజ్ ఘటనపై స్పందించిన హోంమంత్రి అనిత కలెక్టర్తో ఫోన్లో మాట్లాడారు. ప్రమాదంపై ఆరా తీశారు. బాధితులకు ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ప్రాణాలు కాపాడడంపై దృష్టి పెట్టండి: చంద్రబాబుఅచ్యుతాపురం ప్రమాదం పై జిల్లా అధికారులు, పరిశ్రమల శాఖ, ఆరోగ్య శాఖ అధికారులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులతో సీఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. క్షతగాత్రులకు అందుతున్న వైద్యంపై వివరాలు తెలుసుకున్నారు. అన్ని విభాగాల వైద్యులను అందుబాటులో ఉంచి బాధితుల ప్రాణాలు కాపాడాలని సూచించారు. ఇప్పటి వరకు 17 మంది చనిపోయారని అధికారులు వివరించారు. కొందరి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని తెలిపారు. ప్రమాదానికి కారణాలు ఏంటనే విషయంలో ప్రాథమిక సమాచారాన్ని సీఎంకు అధికారులు వివరించారు. ప్లాంట్ నిర్వహణలో మానవ తప్పిదం, ప్లాంట్ నిర్మాణంలో లోపాలపై ప్రాథమిక సమాచారాన్ని సీఎంకు వెల్లడించారు. ప్రమాదం అనంతరం ఫార్మా కంపెనీ యాజమాన్యం స్పందన సరిగా లేదని స్పష్టం చేశారు. ముందు బాధితుల ప్రాణాలు కాపాడడంపై దృష్టి పెట్టాలన్నారు సీఎం చంద్రబాబు. ఉన్నత స్థాయి దర్యాప్తు జరిపి నివేదిక ఇవ్వాలన్నారు. ఇంత మంది ప్రాణాలు కోల్పోవడం తనను తీవ్రంగా కలిచివేసిందన్నారు. ప్రతి ఒక్క బాధితుడిని ఆదుకునే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఫార్మా ప్రమాదంలో మృతుల వివరాలు 10 మంది వివరాలను గుర్తించారు. మృతుల్లో సన్యాసినాయుడు(ప్లాంట్ ఏజీఎం), రామిరెడ్డి(ల్యాబ్ హెడ్), హారిక (కెమిస్ట్), పార్థసారథి (ప్రొడక్షన్ ఆపరేటర్), వై.చిన్నారావు(ప్లాంట్ హెల్పర్), మోహన్ (ఆపరేటర్), గణేశ్ (ఆపరేటర్), హెచ్. ప్రశాంత్, ఎం.నారాయణ, పి. రాజశేఖర్ ఉన్నారు





## జమ్మూ కశ్మీర్ ఎన్నికల ఇన్‌చార్జీలుగా కిషన్ రెడ్డి, రాంమాధవ్

**హైదరాబాద్ బ్యూరో, ప్రజానావ:** కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో పాటు బీజేపీ మాజీ ప్రధాన కార్యదర్శి రాం రాంమాధవ్‌ను అధిష్ఠానం జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జీలుగా నియమించింది. ఈ మేరకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఉత్తర్వులు జారీ చేశారు. జమ్మూ కశ్మీర్‌లో మూడు దశలుగా అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. సెప్టెంబర్ 18న తొలి దశ, 25న రెండోదశ, అక్టోబర్ ఒకటిన మూడో దశ ఎన్నికలు జరుగనుండగా.. అక్టోబర్ 4న ఫలితాలు వెల్లడవనున్నాయి. ఈ మేరకు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్ ప్రకటన విడుదల చేశారు. జమ్మూ కశ్మీర్‌లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాంమాధవ్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిలను ఎన్నికల ఇన్‌చార్జీలుగా నియమించారని.. నియామకం తక్షణమే అమలులోకి వస్తుందని పేర్కొన్నారు. మాధవ్ 2014-20 కాలంలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. జమ్మూ కశ్మీర్, అసోం, ఇతర ఈశాన్య రాష్ట్రాల రాజకీయ వ్యవహారాలను నిర్వహించే బాధ్యత ఆయనది. సెప్టెంబర్ 26, 2020న పునర్వ్యవస్థీకరణలో భాగంగా బీజేపీ ఆయనను ప్రధాన కార్యదర్శి పదవి నుంచి తప్పించింది.

## సీఎం రేవంత్ రెడ్డికి హైదరాబాద్ కోర్టు నోటీసులు

**బీజేపీ రిజర్వేషన్లు రద్దు చేయబోతుందని రేవంత్ ఆరోపణలు**

**హైదరాబాద్, ప్రజానావ:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హైదరాబాద్ స్పెషల్ ఫస్ట్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ ఏడాది మే 4న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని ప్రకాశం స్టేడియంలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, కేంద్రంలో మరోసారి బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లను రద్దు చేస్తుందని ఆరోపణలు చేశారు. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై బీజేపీ ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లుతో పాటు అజయ్ కుమార్ అనే వ్యక్తి పై కోర్టులో పిటిషన్ లు దాఖలు చేశారు. బీజేపీ ప్రతిష్టను దెబ్బతీసేలా రేవంత్ రెడ్డి ఆరోపణలు చేశారని, ఆయనపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు బీజేపీ పరువు, ప్రతిష్టలకు భంగం కలిగించినందుకు సీఆర్పీసీలోని 204, డిఫర్మేషన్ సెక్షన్ 499, పీపుల్స్ రిప్రజంటేటివ్స్ యాక్ట్ 125 కింద కేసులు నమోదు చేయాలని పిటిషన్లలో విజ్ఞప్తి చేశారు. మే 17న ఈ పిటిషన్లు మొదటిసారిగా విచారణకు రాగా, మేజిస్ట్రేట్ అదే నెల 22కి వాయిదా వేశారు. వెంకటేశ్వర్లు గైర్హాజరు కావడంతో మే 24న మళ్లీ విచారణ జరిపి జూలై 3వ తేదీకి వాయిదా వేశారు. ట్రయల్ కోర్టు ఇచ్చిన ఈ వాయిదా ఉత్తర్వులను సవాల్ చేస్తూ వెంకటేశ్వర్లు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి. విజయసేన్ రెడ్డి బుధవారం ఈ కేసు విచారణ జరిపి, ఈ పిటిషన్‌ను వీలైనంత త్వరగా పరిష్కరించాలని ట్రయల్ కోర్టుకు ఆదేశాలు జారీ చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు హైదరాబాద్ స్పెషల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు సీఎం రేవంత్ రెడ్డికి నోటీసు లు జారీ చేసింది.



## పోలెండ్‌లో అడుగుపెట్టిన మోడీ

- 45 ఏళ్లలో భారత ఇక్కడ పర్యటించడం ఇదే తొలిసారి
- వ్యాపార దిగ్గజాలు, పర్యావరణవేత్తలతోనూ చర్చలు జరపనున్న భారత ప్రధాని
- ఘన స్వాగతం పలికిన ప్రవాస భారతీయులు

**వార్సా:** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పోలెండ్‌లో అడుగుపెట్టారు. ఆ దేశ రాజధాని వార్సాలో మోడీకి ఘనస్వాగతం లభించింది. భారత్, పోలెండ్ మధ్య ఉన్న దౌత్య సంబంధాలకు 70 ఏళ్లు పూర్తైన సందర్భంగా మోడీ ప్రస్తుతం అక్కడ పర్యటించారు. అయితే, గత 45 ఏళ్లలో భారత ప్రధాని పోలెండ్‌లో పర్యటించడం ఇదే తొలిసారి కావడం విశేషం. 1979లో చివరిసారిగా నాటి భారత ప్రధాని మొరార్జీ దేశాయ్ పోలాండ్‌కు వెళ్లారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా ప్రధాని మోడీ పోలాండ్ అధ్యక్షుడు, ప్రధాన మంత్రితో భేటీ కానున్నారు. పోలాండ్‌కు చెందిన వ్యాపార దిగ్గజాలు, పర్యావరణవేత్తలతోనూ మోడీ చర్చలు జరపనున్నారు. భారత సంతతి ప్రజలను కలవనున్నారు. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు ఏర్పడి 70 ఏళ్లు పూర్తైన సందర్భంగా జరుగుతన్న ఈ పర్యటన ప్రత్యేకమైనదని ప్రధాని మోడీ పేర్కొన్నారు. సెంట్రల్ యూరప్‌లో పోలాండ్ కీలక ఆర్థిక భాగస్వామి అని తెలిపారు. కాగా, పోలెండ్ లో ప్రవాస భారతీయులు స్వాగతం పలికిన ఫొటోలను మోడీ పోస్ట్ చేశారు. పెద్ద ఎత్తున ప్రవాస భారతీయులు మోడీని చూసే హర్షం వ్యక్తం చేశారు. మోడీ మోడీ అంటూ నినాదాలు చేశారు. ఆయనతో ఫొటోలు దిగిందేకు పోటీ పడ్డారు. ప్రధాని మోడీ కూడా వారిని ఆత్మీయంగా పలకరించారు. ప్రవాసులు చూపిస్తున్న ఆదరాభిమానలకు ప్రధాని మోడీ ముగ్ధుడయ్యారు. అయితే, పోలెండ్‌లో రెండు రోజులపాటు పర్యటించనున్న మోడీ.. అక్కడ నుంచి ఆ తర్వాత ఉక్రెయిన్ వెళ్లనున్నారు. ఆగస్టు 23న ఓ స్పెషల్ ట్రైన్‌లో సుమారు 10 గంటల పాటు ప్రయాణించి ఉక్రెయిన్ రాజధాని కీవ్‌కు చేరుకుంటారు. ఆ తర్వాత ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ భేటీ అవుతారు. ఆ తర్వాత తిరిగి మళ్లీ రైలులోనే పోలెండ్ చేరుకుంటారు. అక్కడ పర్యటన ముగించుకొన్నాక మోడీ తిరిగి స్వదేశానికి తిరిరానున్నారు. కాగా, ఈ పర్యటనకు ముందు ప్రధాని మోడీ ఓ ప్రకటనను విడుదల చేశారు. ఉక్రెయిన్‌లో శాంతి, స్థిరత్వం త్వరగా తిరిగి రావాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు.

### కీలక ఆర్థిక భాగస్వామి..

'మధ్య ఐరోపాలో భారత్‌కు పోలెండ్ కీలక ఆర్థిక భాగస్వామిగా ఉంది. ఇరుదేశాల మధ్య భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు పోలెండ్ అధ్యక్షుడు ఆంద్రెజ్ దుడా, ప్రధాని డొనాల్ టస్క్ తో నా భేటీ కోసం ఎదురుచూస్తున్నా. అక్కడి భారతీయులతోనూ ముచ్చటిస్తా. ఆ పర్యటనను ముగించుకొని ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదమిర్ జెలెన్‌స్కీ ఆహ్వానం మేరకు కీవ్ వెళ్లనున్నా. ఆ దేశంలో భారత ప్రధాని చేపట్టబోయే తొలి పర్యటన ఇదే కానుంది. ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సహకారాన్ని బలోపేతం చేయడమే ప్రధానాంశంగా ఈ పర్యటన సాగనుంది. గత రెండేళ్లుగా కొనసాగుతున్న ఉక్రెయిన్ వివాదానికి శాంతియుత పరిష్కారంపై జెలెన్‌స్కీతో నా ఆలోచనలు పంచుకొనే అవకాశం కోసం ఎదురుచూస్తున్నా. అక్కడ శాంతి, స్థిరత్వం త్వరగా తిరిగిరావాలని ఆకాంక్షిస్తున్నా' అని ప్రధాని మోడీ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



## ఆ ఫామ్‌హౌస్ నా దోస్తుది

(మొదటిపేజీ తరువాయి)

లేదు. నేను లీజు మీద ఉన్నాను. ఒకవేళ తప్పు జరిగితే.. దగ్గరుండి కూల్చివేయించేందుకు సహకరిస్తాను. ఇక హైడ్రానో.. అమీబానో ఉంది కదా.. దాని తీసుకొని అక్కడ్నుంచి నేరుగా పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నుంచి మొదలు పెడుదాం. వాళ్ల తమ్ముడు కూడా అక్కడే ఉన్నాడు. అన్నీ ఒక్కటే రోజు కూలగొడుదాం.. ప్రజలకు పారదర్శకంగా ఉందాం. ప్రభుత్వం ఎలాంటి చర్య తీసుకున్నా నాకు ఎలాంటి ఇబ్బంది, అభ్యంతరం లేదు అని కేటీఆర్ స్పష్టం చేశారు.

## స్పీడ్ పెంచండి

(మొదటిపేజీ తరువాయి)

ఏవైనా సాంకేతిక సమస్యలుంటే వెంటనే కేంద్ర ప్రభుత్వంతో చర్చించాలని సీఎం చెప్పారు. ఈ సమీక్షా సమావేశంలో రోడ్లు, భవనాల శాఖ మంత్రి సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, నల్గొండ ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి గారు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రైతుల రుణాలు మాఫీ చేయాలని నేడు బీఆర్ఎస్ ధర్నా

- మహేశ్వరంలో కేటీఆర్.. ఆలేరులో హరీశ్ రావు
- మండల, నియోజకవర్గ కేంద్రాల్లో ఆందోళనలు

**హైదరాబాద్, ప్రజానావ:** రైతులందరి రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ ఆందోళనలు చేపట్టనుం ది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుధవారం తెలంగాణ భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈ విషయం వెల్లడించారు. రుణ మాఫీ పై ప్రభుత్వం చెబుతున్నవి అర్థసత్యాలు, అసత్యాలేనని తెలిపారు. మాఫీ పేరుతో ప్రభుత్వం రైతులక టోపీ పెట్టిందన్నారు. మహేశ్వరంలో తాను, ఆలేరులో హరీశ్‌రావు ధర్నాల్లో పాల్గొంటామని, అన్ని మండల కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రాల్లో పార్టీ శ్రేణులు ఆందోళనల్లో పాలు పంచుకుంటారని తెలిపారు. రుణమాఫీ కోసం తాము చేసే ఆందోళనలు మొదటి అడుగు మాత్రమే అన్నారు. రైతులపై పెట్టిన కేసులు ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు. హామీ ఇచ్చిన మేరకు రుణమాఫీ చేయనందుకు ప్రభుత్వం క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం వ్యాఖ్యలకు నిరసనగా తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకాలు చేస్తామన్నారు. ఎప్పటిలోగా రుణమాఫీ పూర్తి చేస్తారో చెప్పాలని ప్రశ్నించారు. రుణాలు మాఫీకాక రైతులు రోడ్డెక్కుతున్నరని ఏ పత్రిక, ఛానల్ చూసినా ఇవే వార్తలు కనిపిస్తున్నాయని తెలిపారు. ఆందోళన చేస్తున్న రైతులపై ఏడేళ్లు, రెండేళ్లు శిక్షలు పడే కేసులు పెడుతూ వేధింపులకు గురి చేస్తున్నారని తెలిపారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాటలు వింటుంటే మాఫీ వట్టిదేనని తేలిపోయిం దన్నారు. రుణమాఫీ ఎట్లా ఎగ్గొట్టాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. రైతుల రుణాలన్నీ మాఫీ చేసేవరకు ఈ ప్రభుత్వం వెంట పడుతామని హెచ్చరించారు.

## ఇన్‌ఫార్మర్ నెపంతో మహిళా మావోయిస్ట్ హత్య

**దారుణంగా చంపి రోడ్డున పడేసిన మావోలు**




**భద్రాచలం, ప్రజానావ:** పోలీసు ఇన్‌ఫార్మర్నెపంతో ఓ మహిళా మావోయిస్టును మావోయిస్టులు దారుణంగా హతమార్చారు. ఆమె మృతదేహాన్ని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం చెన్నాపురం సమీపంలో బుధవా రం ఉదయం వదిలి వెళ్లారు. వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌లోని బాలాజీ నగర్ కు చెందిన బంటి రాధ అలియాస్ నీల్సో(34) కొన్నేళ్ల క్రితం మావోయిస్టు పార్టీలో చేరి చురుకుగా పనిచేస్తుండడంతో పార్టీ ఆమెకు పలు కీలక బాధ్యతలు అప్పగించింది. ఈ క్రమంలో ఇన్‌ఫార్మర్‌గా మారి తమ సమాచారం పోలీసులకు చేరవేస్తుందనే నెపంతో ఆమెను మావోయిస్టులు హత మార్చారు. మృతదేహాన్ని తీసుకొచ్చి చెన్నాపురం సమీపంలో వదిలి వెళ్లారు. అయితే నీల్సో మృతదేహం వద్ద ఆంధ్రా-ఒడిశా బార్డర్ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి గణేశ్ పేరుతో లేఖ వదిలి వెళ్లారు. విప్లవ ద్రోహి నీల్సో అని, అందుకే ఆమెను హతమార్చినట్లు లేఖలో పేర్కొన్నారు. కాగా.. విషయం తెలుసుకున్న చర్ల సీఐ రాజువర్మ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం భద్రాచలం ఏరియా హాస్పి టల్‌కు పంచనామా నిమిత్తం తరలించారు.

## ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత్‌దాస్‌కు

# ఉత్తమ ర్యాంక్

### సత్తాకు ఇది నిదర్శనమని.. అభినందించిన ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 21 :** ప్రపంచంలో అత్యుత్తమ కేంద్ర బ్యాంకర్‌గా వరుసగా రెండోసారీ ఎంపికైన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ శక్తికాంత దాస్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభినందించారు. ఇది ఆయనలోని నాయకత్వానికి లభించిన గుర్తింపుగా కొనియాడారు. ఈ ఘనత సాధించిన ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్‌కు అభినందనలు. అది కూడా రెండోసారి. ఆర్‌బీఐలో ఆయన నాయకత్వానికి ఆర్థిక వృద్ధి, స్థిరత్వాన్ని నిర్ధరించే దిశగా ఆయన చేసిన కృషికి ఇది గుర్తింపు అని మోదీ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. అమెరికాకు చెందిన గ్లోబల్ ఫైనాన్స్ మ్యాగ్‌జైన్ ఇచ్చిన ర్యాంకుల్లో శక్తికాంత దాస్‌కు అగ్రస్థానం దక్కింది. గ్లోబల్ ÷నాన్స్ సెంట్రల్ బ్యాంకర్ రిపోర్ట్ కార్డ్స్ 2024లో శక్తికాంత దాస్‌కు 'ఏ' రేటింగ్ లభించిందని సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఆర్‌బీఐ వెల్లడించింది. ఏ రేటింగ్‌ను ప్రపంచంలో ముగ్గురు కేంద్ర బ్యాంక్ గవర్నర్ లకు ఇవ్వగా.. అందులో దాస్ అగ్రస్థానం పొందారు. ద్రవ్యోల్బణం, ఆర్థికాభివృద్ధి లక్ష్యా లు, ఆర్థిక స్థిరత్వం, వడ్డీ రేట్ల నిర్వహణ ఆ ధారంగా కేంద్ర బ్యాంకుల గవర్నర్లకు ఏ నుంచి ఎఫ్ వరకు గ్రేడ్‌లను కేటాయించారు. అద్భుత పనితీరుకు ఏ, అధ్వాన పనితీరుకు ఎఫ్ రేటింగ్ ఇచ్చారు. కేంద్ర బ్యాంకర్లలో డెన్మార్క్‌కు చెందిన క్రిస్టియన్ కెటెల్ ధామ్‌సన్, స్విట్జర్లాండ్ గవర్నర్ థామస్ జే జోర్డాన్ ఉన్నారు.

## కోల్‌కతా కేసులో డాక్టర్ల ఆందోళన

- ఆస్పత్రిలో విధ్వంసంపై నిర్లక్ష్యం
- ఇద్దరు పోలీసులను సస్పెండ్ చేసిన ప్రభుత్వం

**కోల్‌కతా, ఆగస్ట్ 21 :** కోల్‌కతా కేసులో డాక్టర్ల ఆందోళన కొనసాగుతోంది. ఆర్జీకర్ ఆస్పత్రిపై అర్ధరాత్రి విధ్వంసం సృష్టించిన ఘటనలో ఇద్దరు ఏసీపీలు, ఎస్‌ఐలు సస్పెండ్ అయ్యారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించారన్న ఆరోపణలతో వేటు పడింది. ఆస్పత్రిపై విధ్వంసం సృష్టించిన 40 మంది దుండగులు అరెస్టు అయ్యారు. కోల్‌కతా మెడికో హత్యాచార ఘటనకు సంబంధించి డాక్టర్ల ఆందోళన కొనసాగుతోంది. అలాగే ఈ ఘటనకు బాధ్యులైన కొంతమందిపై పోలీసులు చర్యలు తీసుకున్నారు. కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్ హత్యాచార ఘటన దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున సంచాలనం సృష్టించింది. ఈ కేసులో ఇప్పటికే కొంతమందిని పోలీసులు అరెస్టు చేశారు. అయితే తాజాగా ఆర్జీకర్ ఆస్పత్రిపై అర్ధరాత్రి విధ్వంసం సృష్టించిన ఆందోళన కారులు 40 మందిని పోలీసులు అరెస్టు చేశారు. అల్లర్లలో పాల్గొన్న మరికొంది కోసం సీసీటీవీ ఫూటేజీని పరిశీలిస్తున్నారు. ఈ విధ్వంస ఘటనను పోలీసులు నిలువరించలేకపోవడంతో ఇద్దరు ఏసీపీలు, ఎస్‌ఐలు సస్పెండ్ అయ్యారు. ఈ కేసుకు సంబంధించి మంగళవారం సుప్రీం కోర్టులో వాదనలు జరిగాయి. ఆస్పత్రుల్లో వైద్యుల భద్రత కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసేందుకు సుప్రీంకోర్టు తొమ్మిది మంది సభ్యులతో కూడిన జాతీయ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. కోల్‌కతాలోని ఆర్జీ కర్ వైద్య కళాశాల, ఆస్పత్రిలో తీవ్ర సంచలనం సృష్టించిన జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం కేసును సుమోటోగా స్వీకరిస్తూ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. టాస్క్‌ఫోర్స్‌లో హైదరాబాద్ ఏఐజీ ఆస్పత్రుల ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ డి. నాగేశ్వర్‌రెడ్డికి చోటు కల్పించింది. పని ప్రదేశాల్లో వైద్యులపై లైంగిక పరమైన హింసను నివారించేందుకు.. వైద్యులు, నర్సులకు భద్రత, గౌరవప్రదమైన పరిస్థితులు కల్పించడానికి జాతీయ కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని ఎన్‌టీఎఫ్‌కు నిర్దేశిరచింది. ఈ మేరకు టాస్క్‌ఫోర్స్, తన మధ్యంతర నివేదికను మూడు వారాల్లోగా.. పూర్తిస్థాయి నివేదికను రెండు నెలల్లోగా సమర్పించాలని ఆదేశించింది. టాస్క్‌ఫోర్స్‌కు కేంద్ర క్యాబినెట్, హోం శాఖ, ఆరోగ్యశాఖ కార్యదర్శులు.. జాతీయ వైద్యమండలి (ఎన్‌ఎంసీ) ఛైర్‌పర్సన్, నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రెసిడెంట్ ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఉంటారని ధర్మానం పేర్కొంది. వైద్యులపై భౌతికదాడులు, లైంగిక హింసకు సంబంధించి వైద్యసంస్థలు తమకు తాము ఎలాంటి నిబంధనలను రూపొందించుకోకపోవడం తీవ్ర ఆందోళనకరం అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ సారథ్యంలోని త్రిసభ్య ధర్మాసనం వ్యాఖ్యానించింది. వైద్యుల భద్రత కోసం చట్టాలు ఉన్నాయని.. అయితే అవి వ్యవస్థాగత సమస్య (సిస్టమెటిక్ ఇష్యూస్)లను పరిష్కరించలేవు అని వ్యాఖ్యానించింది. పనిచేసే చోట వైద్యులకు భద్రతాలేమిపై సుప్రీం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ.. క్షేత్రస్థాయిలో మార్పులు తెచ్చేందదుకు మరో అత్యాచారమో.. హత్యో జరిగేదాకా ఎదురుచూడకూడదు అని కోర్టు వ్యాఖ్యానించింది. ఆర్జీకర్ ఆస్పత్రిలో హత్యాచారం, హత్యకు గురైన జూనియర్ వైద్యురాలి పేర్లు, ఫొటోలు, వీడియోలను తక్షణమే సామాజిక మాధ్యమాల్లోంచి తొలగించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. హత్యాచార ఘటనకు నిరసనగా దేశవ్యాప్తంగా ర్యాలీలు నిర్వహిస్తున్న వైద్యులు.. ఆందోళనలను విరమించి, ఎప్పటిలాగే వైద్యసేవలు కొనసాగించాలని అప్పీలు చేసింది. వైద్యుల సమ్మెతో వైద్య సేవలు అందక రోగులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొంది. 'వైద్యుల భద్రతపై భరోసా కల్పించేందుకు మేం ఉన్నాం.. ప్లీజ్ మమ్మల్ని నమ్మండి' అని వైద్యులను ఉద్దేశించి పేర్కొంది. ఈ క్రమంలోనే కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న ఢిల్లీలోని ఆర్‌ఎంఎల్ ఆస్పత్రి వైద్యులు తమ సమ్మెకు ముగింపు పలికారు. జూనియర్ వైద్యురాలిపై హత్యాచార కేసును సుమోటోగా స్వీకరించడాన్ని రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ స్వాగతించింది. మరోవైపు.. ఆర్జీ కర్ ఆస్పత్రిలో ఆర్థిక అవకతవకలపై విచారణ జరిపేందుకు స్వామి వివేకానంద స్టేట్ పోలీస్ అకాడమీ ఐజీ ప్రణవ్ కుమార్ సారత్యంలో నాలుగు సభ్యులతో కూడిన దర్యాప్తు బృందాన్ని (సిట్) బెంగాల్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

## శ్రీరాంసాగర్‌కు భారీగా వరదనీరు

**నిజామాబాద్, ప్రజానావ:** ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో రాష్ట్రంలోని ప్రాజెక్ట్ జలకళను సంతరించుకుంటున్నాయి. తాజాగా శ్రీరాం సాగర్ ప్రాజెక్ట్‌లోకి వరద కొనసాగుతున్నది. ప్రాజెక్ట్‌లోకి 10,591 వేల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతున్నది. కాకతీయ కాలువ ద్వారా 2,465 క్యూసెక్కుల నీటిని కిందకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు కాగా ప్రస్తుత నీటి మట్టం1082 అడుగులు ఉంది. పూర్తి స్థాయి నీటి నిల్వ సమర్థ్యం 80.5 టీఎంసీలు. ప్రస్తుత నీటి నిల్వ సామర్థ్యం 50.70 టీఎంసీలు ఉన్నట్లు అధికారులు తెలిపారు.

### తుంగభద్ర జలాశయానికి వరద

**కర్నూలు:** కర్నూలు జిల్లాలోని తుంగభద్ర జలాశయానికి వరద ప్రవాహం కొనసాగు తోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం1.633 అడుగులు కాగా ప్రస్తుత నీటి మట్టం 1625.70 అడుగులుగా ఉంది. ప్రాజెక్టులోకి ఇన్ ఫ్లో 36,370 క్యూసెక్కులు, అవుట్ ఫ్లో 8,658 క్యూ సెక్కులు అని అధికారులు వెల్లడించారు. పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 105.788 టీఎంసీలుగా అని చెప్పారు. ప్రస్తుత నీటి నిల్వ సామర్థ్యం 78.803 టీఎంసీలు అని వివరించారు. మరోవైపు జిల్లాలోని గాజులదిన్నె ప్రాజెక్టుకు కూడా వరద పోటెత్తింది. ఇన్ ఫ్లో 30 వేల క్యూసెక్కులుగా ఉంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 2 టీఎంసీల వరద నీరు వచ్చి చేరిందని ఇంజనీర్లు అంచనా వేశారు.

## రుణమాఫీ పేరుతో

# రైతులకు కుచ్చు టోపీ

- రూ.2 లక్షల రుణమాఫీ హామీ బూటకం
- ప్రభుత్వం అర్థసత్యాలు, అసత్యాలను చెబుతోంది
- మంత్రుల మాటల్లోనే పొంతన లేకుండా పోయింది
- ప్రభుత్వ తీరుకు నిరసనగా నేడు మండల కేంద్రాల్లో ధర్నాలు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు




**హైదరాబాద్, ప్రజానావ:** కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన రూ. 2 లక్షల రుణమాఫీ హామీ బూటకమని.. రుణమాఫీ మొత్తం దగా, మోసమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రుణమాఫీ విషయంలో ప్రభుత్వం చెబుతున్నవి అర్ధసత్యాలు, అసత్యాలన్నారు. రుణమాఫీపేరుతో రైతులకు కుచ్చు టోపీ అని మండిపడ్డారు. రుణమాఫీ విషయంలో ప్రభుత్వ తీరును ఎండగడుతూ..గురువారం అన్ని మండల కేంద్రాల్లో రైతుల ధర్నాలు ఉంటాయి. రేపటి ఆందోళనలు మొదటి అడుగు మాత్రమే. రైతులపై కేసులు ఉపసంహరించుకోవాలన్నారు. రుణమాఫీ చేయనందుకు ప్రభుత్వం క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం వ్యాఖ్యలకు నిరసనగా తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకాలు చేస్తామని కేటీఆర్ వెల్లడించారు. ఎప్పటిలోగా రుణమాఫీ పూర్తి చేస్తారో చెప్పాలని కేటీఆర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రూ. 2 లక్షలు రుణమాఫీ చేశామని మంత్రి తుమ్మల చెప్పారు. రుణమాఫీపై ఉత్తర కుమార ప్రగల్బాలు పలుకుతున్నారని.. రుణమాఫీపై రైతులకు ప్రభుత్వం క్షమాపణలు చెప్పాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఆగ్రహంతో రగిలిపోతున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. రుణమాఫీ జరగక రైతులు రోడ్డెక్కుతున్నరు.. ఏ పత్రిక, ఛానల్ చూసినా ఇవే వార్తలు కనిపిస్తున్నాయి. ఆందోళన చేస్తున్న రైతులపై ఏడేళ్లు, రెండేళ్లు శిక్షలు పడే కేసులు పెడుతూ మరోవైపు అందరికి రుణమాఫీ అయిందని సీఎం సంబరాలు చేసుకుంటున్నా రని కేటీఆర్ విమర్శించారు. రూ. 31 వేల కోట్లు మాఫీ చేశామని సీఎం చెబుతున్నారు. రుణమాఫీపై మంత్రులు తలోమాట మాట్లాడుతున్నారు. సాంకేతిక కారణాలతో మాఫీ కాలేదని మంత్రులు చెబుతున్నారు. భట్టి చెప్పిన లెక్కలు వింటే రుణమాఫీ వట్టిదేనని తేలిపోయింది. మాఫీ ఎట్లా ఎగ్గొడదామని కాంగ్రెస్ ప్రభుత్వం ఎత్తుగడలు వేస్తుందని.. అసలు రుణమాఫీపై ప్రభుత్వానికి స్పష్టత ఉందా..లేదా.. అని కేటీఆర్ ప్రశ్నించారు. మాఫీ 30 శాతం, కాంగ్రెస్ మోసం 100 శాతమన్న ఆయన ఇది రైతు స్వరాజ్యం కాదు.. ఏడిపిస్తున్న రాజ్యమని ధ్వజమెత్తారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా బీఆర్ఎస్ ఉన్నంతకాలం రైతులకు అండగా ఉంటుందని, రైతులు స్థైర్యం కోల్పోవ ద్దని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. చ్చి మోసగాళ్ల ప్రభుత్వం ఇదని.. 49 వేల కోట్ల వ్యవసాయ రుణాలున్నాయని చెప్పింది మీరా..కాదా..? అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన కేటీఆర్.. ప్రభుత్వం రుణమాఫీ పేరుతో కేవలం రూ.7500 కోట్లతో సరిపెట్టాలని చూస్తున్నట్టుం దన్నారు. లక్షల మంది రైతులను మోసం చేసిన ఈ ప్రభుత్వాన్ని ఏం చేయాలి..? సీఎం తడిగుడ్డతో రైతుల గొంతు కోసిండు. ప్రజల దృష్టి మళ్లించేందుకు సీఎం రేవంత్ బజారు భాష మాట్లాడుతున్నారు. కేసీఆర్‌ను తిడితే సంబరపడే కొన్ని మీడియా సంస్థలున్నాయి. మొత్తం రుణమాఫీ చేసే వరకు ప్రభుత్వాన్ని వెంటాడుతామని కేటీఆర్ హెచ్చరించారు.

## ట్రైనీ డాక్టర్ హత్యాచారం కేసు

- వెలుగులోకి వస్తున్న కాలేజీ మాజీ చీఫ్ అక్రమాలు
- అన్‌క్లెయిమ్‌డు శవాల అమ్మకం జరిగినట్లు గుర్తింపు

**కోల్‌కతా, ఆగస్ట్ 21 :** కోల్‌కతాలో ఆర్‌జీ కార్ మెడికల్ కళాశాల ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం, హత్య ఘటన సంచలనంగా మారింది. ఈ ఘటన నేపథ్యంలో వైద్య కళాశాల మాజీ చీఫ్ సందీప్ ఘోష్ చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. హత్యాచార ఘటన నేపథ్యంలో ఆయన ప్రిన్సిపల్ పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. వైద్యురాలి ఘటనలో ప్రస్తుతం విచారణ ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో ఆయనపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆసుపత్రికి సంబంధించిన ఆర్థిక వ్యవహారాల్లో అక్రమాలకు పాల్పడటమే కాకుండా.. బయోమెడికల్ వ్యర్థాలు, వైద్య సమగ్రిని కూడా ఇతర దేశాలకు రవాణా చేసి సొమ్ము చేసుకున్నట్లు ఆర్‌జీ కార్ మెడికల్ కాలేజీ మాజీ డిప్యూటీ సూపరింటెండెంట్ అక్తర్ అలీ తాజాగా ఆరోపించారు. సందీప్ ఘోష్ క్లెయిమ్ చేయని మృతదేహాలను విక్రయించడం సహా అనేక చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఈ మేరకు ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు ఆసక్తికర విషయాలు వెల్లడించారు. అక్తర్ అలీ గతేడాది వరకూ ఆర్‌జీ కార్ కళాశాలలోనే పనిచేసి ప్రస్తుతం ముర్షిదాబాద్ డిప్యూటీ మెడికల్ కాలేజీ సూపరింటెండెంట్‌గా పని చేస్తున్నారు. అయితే, సందీప్ ఆగడాలపై ఉన్నతాధికారులకు గతంలోనే ఫిర్యాదు చేసినట్లు ఆయన తాజాగా వెల్లడించారు. ఆసుపత్రిలో వినియోగించిన సిరంజ్‌లు, సెలైన్ బాటిల్స్, రబ్బర్ గ్లౌజులు వంటి బయోమెడికల్ వ్యర్థాలు ప్రతీ రెండ్రోజులకు 500 కిలోల వరకూ పోగెయ్యేవని తెలిపారు. వాటిని ఇద్దరు బంగ్లాదేశీవాసుల సాయంతో బంగ్లాదేశ్‌కు రవాణా చేసి రీసైక్లింగ్ చేయించేవాడని పేర్కొన్నారు. సందీప్ చట్టవిరుద్ధ కార్యకలాపాల గురించి రాష్ట్ర విజిలెన్స్, ఏసీబీ, హెల్త్ డిపార్ట్‌మెంట్స్‌కు తాను గతంలోనే ఫిర్యాదు చేసినట్లు అక్తర్ అలీ తెలిపారు. దీంతో మాజీ ప్రిన్సిపల్‌పై విచారణకు కమిటీని ఏర్పాటు చేశారని, అందులో తాను కూడా సభ్యుడినని చెప్పారు. ఈ విచారణలో సందీప్ దోషిగా తేలినప్పటికీ అతనిపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదన్నారు. సందీప్ ఘోష్‌పై రాష్ట్ర ఆరోగ్య శాఖకు విచారణ నివేదికను సమర్పించినట్లు చెప్పారు. అయితే, అదే రోజు తనపై బదిలీ వేటు వేశారని అలీ పేర్కొన్నారు. 'నేను సందీప్‌పై విచారణ నివేదిక సమర్పించాను. ఇక అదే రోజు నన్ను ఆర్‌జీ కార్ ఆసుపత్రి నుంచి బదిలీ చేశారు. ఈ కమిటీలోని మిగిలిన ఇద్దరు సభ్యులను కూడా బదిలీ చేశారు. అతని నుంచి విద్యార్థులను రక్షించేందుకు నేను చేయగలిగినదంతా చేశాను. అయితే, ఆ ప్రయత్నంలో విఫలమయ్యానని అలీ వివరించారు.

## శ్రీశైలంలో కుండపోత వర్షం

- దేవాలయ పరిసరాలు జలమయం
- తీవ్ర ఇబ్బదులు పడ్డ భక్తులు

**నంద్యాల, ప్రజానావ:** శ్రీశైలంలో ఉరుములు,మెరుపులతో కూడిన భారీ వర్షం దంచికొట్టింది. రాత్రి నుంచి ఉదయం వరకు ఎడతెరుపు లేకుండా భారీ వర్షం కురిసింది. వర్షం ధాటికి శ్రీశైలంలోని కొత్తపేటలో ఉన్న ఇళ్లలోకి భారీగా వరద నీరు చేరింది. దీంతో స్థానికులు రాత్రంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నంది సర్కిల్‌లోని షాపింగ్ కాంప్లెక్స్‌లోకి కూడా భారీగా వర్షపునీరు చేరింది. ఊహించని రీతిలో భారీ వర్షం పడడంతో స్థానికులే కాకుండా భక్తులు కూడా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వీరంతా బయటకు రాలేక వసతి గృహాలకే పరిమితమయ్యారు. శ్రీశైలంలోని ప్రధాన రహదారులు వర్షపు వరద పొంగిపొర్లుతోంది. మహా శివుడు కొలువైన క్షేత్రం.. కనీవినీ ఎరుగని స్థాయిలో.. శ్రీశైలం చరిత్రలోనే కుండపోత వర్షం పడింది. శ్రీశైలం పుణ్యక్షేత్రం రోడ్లు అన్నీ నదుల్లా మారాయి.. నీళ్ల ప్రవాహానికి బండ్లు కొట్టుకుపోయాయి.. నీటి ఉధృతికి శ్రీశైలం వాసులు, భక్తులు భయాందోళనలకు గురయ్యారు. ఇళ్లల్లోకి నీళ్లు వచ్చాయి.. దుకాణాలు మునిగిపోయాయి.. బ్యాంకులు తడిసిపోయాయి.. శ్రీశైలంలో కుండపోత కాదు.. కుంభవృష్టిగా పడింది వాన. మంగళవారం ( ఆగస్టు 20, 2024 ) రాత్రి కురిసిన కుంభవృష్టి వర్షానికి కొండ చరియలు వర్షపు నీటికి తడిసి ముద్దయ్యాయి, కొండ చరియలు విరిగి పెద్ద పెద్ద బండరాళ్లు తెలంగాణ,ఆంధ్రని కలిపే రహదారిపై పడ్డాయి. జలాశయం దిగువన రహదారి మార్గంలో రోడ్డుకు అడ్డంగా కొండ చరియలు విరిగిపడడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయితే కొండ చరియలు రాత్రి సమయానికి విరిగి పడడంతో రాత్రి వాహనాల రాకపోకలు లేకపోవడంతో పెను ప్రమాదమే తప్పిందని చెప్పాలి. రోడ్డుపై పడ్డ కొండ చరియల బండరాళ్లను త్వరగా తొలగించి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రయాణికులు అధికారులను కోరుతున్నారు.

## విద్యార్థిని ఢీకొన్న బస్ డ్రైవర్ అరెస్ట్

**హైదరాబాద్, ప్రజానావ:** బీఫార్మసీ విద్యార్థిని హారికను ఢీ కొట్టిన స్కూల్ బస్సును పోలీసులు గుర్తించారు. డ్రైవర్‌ను అరెస్ట్ చేసి రంగారెడ్డి స్కూల్ బస్సును రాజేంద్రనగర్ పోలీసులు సీజ్ చేశారు. వివరాల్లోకి వెళ్తే..అత్తాపూర్ రెడ్డి బస్తీకి చెందిన హారిక పిల్లర్ నెంబర్ 130 వద్ద మంగళవారం ఉదయం రోడ్డు దాటుతుండగా ఓ పాఠశాలకు చెందిన బస్సు అమెను ఢీ కొట్టింది. ఈ ఘటనలో అమె కింద పడి తీవ్రగాయాలపాలైయింది. స్థానికులు సమాచారంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని అమెను స్థానిక హాస్పిటల్‌లో చేర్పించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బుధవారం డ్రైవర్‌ను అరెస్ట్ చేశారు.

## హైడ్రా కూల్చివేతలపై హైకోర్టు ప్రశ్నలు

### జన్వాడ ఫామ్‌హౌజ్ కూల్చివేతపై పిటిషన్

**హైదరాబాద్, ప్రజానావ:** జన్వాడ ఫాంహౌస్ కూల్చొద్దంటూ ప్రదీప్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. వాదనల సందర్భంగా హైడ్రాకు ఉన్న పరిధుల గురించి చెప్పాలని ఏఏజీకి ఉన్నత న్యాయస్థానం సూచించింది. ఈక్రమంలో హైడ్రా స్వతంత్ర ప్రతిపత్తి గల సంస్థ అని ఏఏజీ పేర్కొన్నారు. మరోవైపు హైడ్రా కూల్చివేతలపై హైకోర్టు ప్రశ్నించింది. స్థల యజమానులు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకుంటారని తెలిపింది. స్థానిక సంస్థల అనుమతితో నిర్మాణాలు జరుగుతాయని పేర్కొంది. 15-20 ఏళ్ల తర్వాత హైడ్రా వచ్చి అక్రమ నిర్మాణమంటూ కూల్చివేయడమేంటని న్యాయస్థానం ప్రశ్నించింది. మరోవైపు చెరువుల పరిరక్షణ కోసమే హైడ్రా ఏర్పాటైందని ఏఏజీ తెలిపారు. ప్రదీప్‌రెడ్డి వేసిన పిటిషన్‌కు విచారణార్హత లేదని చెప్పారు. జన్వాడలో ఉన్న ఫాంహౌస్ జీవో 111లోకి వస్తుందని పేర్కొన్నారు. జీవో 111 పరిధిలోని భూములు, ఫాంహౌజ్‌లు నీటిపారుదల శాఖ చూస్తోందని వివరించారు. వీటిని కూల్చివేసే హక్కు హైడ్రాకు లేదని ఏఏజీ తెలిపారు. కూల్చివేతల గురించి చర్చించాల్సి ఉందని హైకోర్టు తెలిపింది. విచారణను మధ్యాహ్నానికి వాయిదా వేసింది. జన్వాడ ఫాంహౌస్ కూల్చొద్దంటూ తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. యజమాని ప్రదీప్‌రెడ్డి ఈ పిటిషన్ దాఖలు చేశారు. ప్రతివాదులుగా రాష్ట్ర ప్రభుత్వం, హైడ్రా కమిషనర్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, లేక్ ప్రొటెక్షన్ కమిటీ సభ్యులు, శంకర్‌పల్లి తహసీల్దార్, చీఫ్ ఇంజినీర్‌ను చేర్చారు. ఉస్మాన్‌సాగర్ ఎఫ్‌టీఎల్ పరిధిలో తన ఫాంహౌస్, పొలం లేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ నెల 14న నా ఫాంహౌస్‌ను నీటిపారుదల శాఖ అధికారులు పరిశీలించారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఫాంహౌస్ లేదని ఆధారాలు చూపించాను. ఎఫ్‌టీఎల్ పరిధిలోనే నిర్మాణం ఉందని అధికారులు వాదించారు.



# మట్టి గణపతులతో పర్యావరణాన్ని కాపాడుకుందాం

**ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి**

**హైదరాబాద్, ప్రజానావ:** మట్టి గణపతులతో పర్యావరణాన్ని కాపాడుకుందామని, పర్యావరణ పరిరక్షణ బాధ్యత అందరిపై ఉందని ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి అన్నారు. బుధవారం ఆమె వినాయక చవితి పండుగను పురస్కరించుకొని మట్టి గణపతులపై అవగాహన కల్పించేందుకు శ్రీకారం చుట్టారు. ప్రతి ఏడాదిలాగానే ఈ సంవత్సరం టీఎస్‌పీసీబీ (తెలంగాణ స్టేట్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు) చైర్మన్‌తో కలిసి మట్టి గణేశ్ విగ్రహాల పోస్టర్లను ఆవిష్కరించారు. రాష్ట్ర సచివాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో అటవీశాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, టీఎస్‌పీసీబీ మెంబర్ కార్యదర్శి రవి, చీఫ్ ఇంజినీర్ రఘు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ ప్లాస్ట్ ఆఫ్ పారిస్ రసాయనాలతో తయారు చేసేన విగ్రహాల వలన పర్యావరణానికి ప్రమాదం ఉందని గుర్తుచేశారు. వీటి స్థానంలో మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 8 అంగుళాల మట్టి గణపతి ప్రతిమలను ఉచితంగా అందించేందుకు ఏర్పాట్లు చేశారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఒక లక్ష విగ్రహాల పంపిణీకి సిద్ధంకాగా, రాష్ట్రవ్యాప్తంగా 32 జిల్లాలకు 64వేల విగ్రహాలను అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పర్యావరణంపై పెద్దఎత్తున అహగహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఈ సందర్భంగా సీఎస్ పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పర్యావరణ గణేశ్ పోస్టర్లను ఆటోట్రాలీల ద్వారా ప్రదర్శించనున్నారు. పర్యావరణహితమైన సందేశాలతో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈమేరకు టీఎస్‌పీసీబీ సిద్ధమవుతోంది. మట్టి గణపతి ద్వారా పర్యావరణ పరిరక్షణపై పాఠశాలలు, కళాశాలల్లో క్విజ్ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. చేతి వృత్తిల వారికి మట్టి విగ్రహలు తయారిపై శిక్షణ ఇవ్వనన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఆటోల వెనుక పోస్టర్ల ప్రదర్శన, బస్‌స్టాప్‌లలో హోర్డింగ్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నగరంలో ప్రధాన కూడళ్ల వద్ద మట్టి గణపతులపై పెద్ద ఎత్తున షార్ట్ ఫిలిం ఆడియో క్లిప్‌ల ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

# పొరపాటున అసెంబ్లీ స్పీకర్ అకౌంట్‌లో రుణమాఫీ

- టెక్నికల్ సమస్యతోనే ఈ తప్పిదం
- రుణమాఫీ డబ్బులు బ్యాంకు ద్వారా ప్రభుత్వానికి వాపస్
- జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్



**వికారాబాద్, ప్రజానావ:** వికారాబాద్ జిల్లాలో రాష్ట శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ బ్యాంకు ఖాతా నెంబర్‌కు రైతు రుణమాఫీ పథకం కింద రూ.1,50,863 పొరపాటున జమ చేయబడిందని జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డీసీసీబీ బ్యాంకు తాండూర్ వారి టెక్నికల్ సమస్య వలన ఈ అమౌంట్ గడ్డం ప్రసాద్ కుమార్ బ్యాంకు ఖాతాలోకి జమ అయిందన్నారు. ఈ విషయంపై స్పీకర్ ప్రసాద్ కుమార్ స్పందిస్తూ నా బ్యాంకు అకౌంట్‌కు పొరపాటున వచ్చిన డబ్బులను తిరిగి అదే బ్యాంక్ ద్వారా ప్రభుత్వానికి వాపసు చేస్తునట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఇదిలా ఉండగా సామాన్య రైతుల రైతు రుణమాఫీ ఎందుకు కాలేదని తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.



# ఆరోగ్యమిత్రల సమస్యలు పరిష్కరించాలని వినతి

**వేములవాడ, ప్రజానావ:** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ ఏరియా ఆసుపత్రిలో విధులు నిర్వర్తిస్తున్న ఆరోగ్యశ్రీ లోని ఆరోగ్య మిత్రలు బుధవారం నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అనంతరం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ పెంచలయ్యకు సమ్మె పత్రాన్ని అందజేశారు. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తమ సమస్యలను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. ఆరోగ్య మిత్రలను గుర్తిస్తూ వేతనం పెంచడమే కాకుండా పదోన్నతి కల్పించాలని వారు వేడుకున్నారు.



వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని సినీ నటుడు, బలగం సినిమా డైరెక్టర్ వేణు బుధవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా రాజన్నకు కోడె మొక్కులు చెల్లించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు వారిని ఆశీర్వదించి, స్వామివారి ప్రసాదం అందించారు.

– వేములవాడ, ప్రజానావ



## కొండాపూర్ జీపీ అవినీతిపై కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు

**కోనరావుపేట, ప్రజానావ:** రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం కొండాపూర్ గ్రామ పంచాయతీలో గతంలో కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ సంస్థ సభ్యులు గ్రామ పంచాయతీ రికార్డు తనిఖీలు నిర్వహించారు. అందులో సంస్థకు లభించిన ఆధారాలను బట్టి సుమారు రూ.36 లక్షల అవినీతి జరిగిందని సంస్థ గుర్తించామన్నారు. అందులో భాగంగా రికార్డ్ తనిఖీల డ్రాప్టింగ్ విభాగముకూ లభించిన ఆధారాలతో ఫైనల్ రిపోర్ట్ తయారుచేసి బుధవారం కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ సంస్థ రికార్డు తనిఖీ విభాగం రాష్ట్ర కార్యదర్శి నేవూరి రత్నాకర్, ఆధ్వర్యంలో కలెక్టర్‌కు అందించారు. దీనిపైన కలెక్టర్ స్పందించి బాధ్యులైన వారిపైన ఎఫ్ఐఆర్ నమోదు చేయమని జిల్లా ఎస్పీకి పంపించారని ఈ క్రమంలో జిల్లా ఎస్పీని కలిసి పూర్తిగా వివరించామన్నారు. దీనిపైన ఎస్పీ సానుకూలంగా స్పందించి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ సంస్థ రికార్డు తనిఖీ విభాగం రాష్ట్ర కార్యదర్శి నేవూరి రత్నాకర్, జిల్లా ఐడీ కార్డ్ ఇన్‌చార్జి సయ్యద్ సలీం, మీడియా ఇంచార్జ్ చౌటపల్లి వెంకటేశ్, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.



# కోల్‌కతా హత్యాచార ఘటనపై ఐద్వా నిరసన

**సిరిసిల్ల, ప్రజానావ:** రాజన్న సిరిసిల్ల జిల్లా ఐద్వా మహిళా సంఘం కమిటీ ఆధ్వర్యంలో కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటనపై నిరసన వ్యక్తం చేశారు. అత్యాచారం చేసి చంపిన నిందితులను చట్టం ముందు దోషులుగా నిలబెట్టి కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి జవ్వాజి విమల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్రంప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా ఐద్వా జిల్లా మహిళా నాయకురాలు సూరం పద్మ పాల్గొన్నారు.



## విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో పాల్గొన్న ప్రభుత్వ విప్

**కోరుట్ల, ప్రజానావ:** జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవాలయంలో బుధవారం జరిగిన శ్రీ లక్ష్మీదేవి, విశ్వక్సేన, ఆంజనేయ నూతన ఉపాలయాల, ద్వారపాలక, రాజగోపుర శిఖర, విమాన వేంకటేశ్వర స్వామివారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం లో ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మంగళ వాయిద్యాలు, బాజాభజంత్రీలు, పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ప్రభుత్వ విప్ స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..

విలేకరులు కావలెను

రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుతున్న ప్రజానావ తెలుగు దినపత్రికలో
పని చేయుటకు జర్నలిస్టులకు ఆహ్వానం.. జర్నలిస్టుగా రాణించాలనే తపన..
వార్తా సేకరణలో నేర్పరితనం ఉన్న వారికి సదావకాశం..

రాజన్న సిరిసిల్ల జిల్లాలో
ఈ కింది మండలాలకు విలేకరులు కావలెను

1. సిరిసిల్ల ఆర్‌సి ఇన్‌చార్జి
2. సిరిసిల్ల టౌన్/రూరల్
3. వేములవాడ ఆర్‌సి ఇన్‌చార్జి
4. వేములవాడ టౌన్
5. వేములవాడ రూరల్
6. తంగళపల్లి
7. ఎల్లారెడ్డిపేట
8. ముస్తాబాద్
9. వీర్నపల్లి
10. గంభీరావుపేట
11. ఇల్లంతకుంట
12. కోనరావుపేట
13. రుద్రంగి
14. బోయినపల్లి

9676667020, 8688523585



## డయాలసిస్ కేంద్రం పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు
- మంథని ఆసుపత్రిలో ఐదు పడకల డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభం

**మంథని, ప్రజానావ:** డయాలసిస్ కేంద్రం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ఇన్ ఫేక్షన్ వచ్చే ప్రమాదం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉంటూ పారిశుధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యత కల్పించాలని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సూచించారు. బుధవారం రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు మంథని ఆసుపత్రిలో 5 పడకల డయాలసిస్ కేంద్రాన్ని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తో కలిసి ప్రారంభించారు. ఆసుపత్రిలోని డయాలసిస్ కేంద్రంలో అమర్చిన పరికరాలు, రోగులకు అందించే సేవలు తదితర వివరాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. డయాలసిస్ కేంద్రం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇక్కడ పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా ఉండేలా వైద్యులు సంబంధిత అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని మంత్రి ఆదేశించారు. డయాలసిస్ కోసం ప్రజలు దూరప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండా మంథనిలోనే అందుబాటులోకి రావడం చాలా సంతోషకరమని, అదేవిధంగా మహాదేవపూర్ ఆసుపత్రిలో కూడా ఐదు పడకల డయాలసిస్ కేంద్రం రోగులకు సేవలందిస్తుందని మంత్రి తెలిపారు. దేశంలో మరే రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో సింగిల్ యూసెజ్ ఫిల్టర్ ద్వారా రోగులకు డయాలసిస్ సేవలు అందిస్తున్నామని అన్నారు. డయాలసిస్ సేవలు అందుకుంటున్న రోగుల సంఖ్య ఆధారంగా అవసరమైన పరికరాల స్టాక్ ముందస్తుగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులకు సూచించారు. మంత్రి వెంట మంథని మున్సిపల్ చైర్ పర్సన్ రమ, మంథని రెవెన్యూ డివిజన్ అధికారి వి.హనుమా నాయక్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డా. ప్రమోద్ కుమార్, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. శ్రీధర్, మంథని ఆసుపత్రి సూపరింటెండెంట్, ప్రజాప్రతినిధులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## సమ్మెబాట పట్టిన ఆరోగ్య మిత్రలు

**చందుర్తి, ప్రజానావ:** రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఆరోగ్యశ్రీ పథకం కింద పని చేస్తున్న ఆరోగ్య మిత్రలు తమ సమస్యల పరిష్కారం కోసం బుధవారం నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. 17ఏళ్లుగా అతి తక్కువ జీతాలతో పనిచేస్తుండడంతో, తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ సమ్మెబాట పట్టారు. ఔట్సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా కాకుండా నేరుగా ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ద్వారా జీతాలు చెల్లించాలని తదితర సమ్యలను పరిష్కరించాలని కోరారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**ప్రజానావ, వేములవాడ:** విద్యుత్ మరమ్మతులో భాగంగా వేములవాడ పట్టణంలోని ఫస్ట్ బైపాస్, డీఎస్పీ ఆఫీస్, అంబేద్కర్ నగర్, ముదిరాజ్ వీధి, మార్కెట్ ఏరియాల్లో గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండనున్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. కావున పట్టణ ప్రజలు సహకరించగలరని వారు కోరారు.



## మూడపెల్లిలో ఘనంగా పోషణ ఆరోగ్య దినోత్సవం

**చందుర్తి, ప్రజానావ:** రాజన్న సిరిసిల్ల జిల్లా చందర్తి మండలం మూడపెల్లి గ్రామంలో బుధవారం పోషణ ఆరోగ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రంలో తల్లులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ ఉపాధ్యాయులు రాధిక, పద్మ, ఆశా కార్యకర్తలు అరుణ, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

# స్థానిక అవసరాల కోసమే ఫ్రీ ఇసుక విధానం

- రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా ప్రజలకు మేలు చేస్తున్నాం..
- మానేరును కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉంది
- అక్రమ ఇసుక రవాణా అందరికీ ప్రమాదకరం
- పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు



**సుల్తానాబాద్, ప్రజానావ:** పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ పట్టణంలోని ఎస్.ఆర్ గార్డెన్‌లో బుధవారం పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు మానేరు పరీవాహక ప్రాంత ఇసుక ట్రాక్టర్ల యజమానులు, డ్రైవర్లతో ఆత్మీయ, అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సౌలభ్యం కోసం, స్థానిక అవసరాల కోసం, పేద, మధ్యతరగతి ప్రజలకు ఇండ్ల నిర్మాణానికి భారం కాకూడదు అనే ఉద్దేశంతో రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా పెద్దపల్లి నియోజకవర్గంలో ఫ్రీ ఇసుక విధానాన్ని అమలు చేస్తున్నట్టు తెలిపారు. గత ప్రభుత్వం ఇసుక రీచ్ లను ఏర్పాటుచేసి లారీల ద్వారా ఇసుకను హైదరాబాద్ వంటి నగరాలకు విచ్చలవిడిగా పంపించి సొమ్ము చేసుకుందని విమర్శించారు. అలాగే స్యాండ్ టాక్స్ విధానం ద్వారా స్థానిక అవసరాలకు కూడా ప్రజలపై భారం మోపిందన్నారు. స్యాండ్ టాక్స్ విధానంలో ఎస్ఆర్ఓలు ఇష్టానుసారంగా ఇసుక రవాణాకు అక్రమ అనుమతులు ఇచ్చి పెద్ద దందా నడిపారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఈ సమస్యలు అన్ని అధిగమించి ప్రజలకు ఫ్రీ ఇసుకను ఇస్తామని, లారీల ద్వారా ఇసుక రవాణాను జరపబోమని హామీ ఇవ్వడం జరిగిందని ఎమ్మెల్యే విజయరమణ రావు అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు తాను ఎమ్మెల్యేగా గెలిచిన తెల్లవారి నుంచే ఇసుక లారీలను కట్టడి చేయడం, ఫ్రీ ఇసుకను అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. అయితే కొంతమంది అతి ఆపేక్ష వల్ల లారీల ద్వారా ఇసుక తరలింపు జరుగుతోందని చెప్పారు. ఈ వ్యవహారం వల్ల ఫ్రీ ఇసుక విధానానికి ఆటంకాలు ఏర్పడి, తిరిగి శ్యాండ్ టాక్స్ విధానాన్ని అమలు చేసేందుకు జిల్లా కలెక్టర్ నిర్ణయించారని తెలిపారు. అక్రమంగా ఇసుక డంపులు ఏర్పాటు చేయడం, లారీల ద్వారా ఇసుకను పంపడం, రాత్రుల్లో ట్రాక్టర్ల ద్వారా ఇసుక రవాణా సాగించడం వంటి చర్యల వల్ల జిల్లా కలెక్టర్ తీవ్రంగా పరిగణించారని ఎమ్మెల్యే గారు పేర్కొన్నారు. తిరిగి తాను జిల్లా కలెక్టర్ గారితో మాట్లాడి మరొక అవకాశం ఇవ్వాలని కోరగా అంగీకరించారని, అయితే, ట్రాక్టర్ యజమానుల తరపున అక్రమ రవాణా చేయమని బాధ్యత వహించి లెటర్ ఇవ్వాలని కలెక్టర్ కోరినట్టు చెప్పారు. దీనికి అంగీకరించి తాను కలెక్టర్‌కు లెటర్ ఇస్తున్నట్టు చెప్పారు. ఇందుకు సంబంధించిన లెటర్‌ను ట్రాక్టర్ యజమానుల సమక్షంలో ఆర్డీవో గారికి అందజేశారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే ఇసుక రవాణా చేయాలని అధికారులు నిర్ణయించారని చెప్పారు. నిర్ణయాన్ని ఎవరు అతిక్రమించినా ఇక తాను బాధ్యత వహించబోనని ఆయన స్పష్టం చేశారు.

**అవసరమైతే రాజకీయాల నుంచి తప్పుకుంటా**

గతంలో ఉన్న పాలకులు, స్థానిక అధికార యంత్రాంగం ఇసుక రవాణా చేస్తూ పబ్బం గడుపుకున్నారని, తాను మాత్రం అవినీతికి పాల్పడే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. అలాంటి పరిస్థితి వస్తే అవసరమైతే రాజకీయాల నుండి తప్పుకుంటానని ఎమ్మెల్యే విజయరమణ రావు భావోద్వేగం తో పేర్కొన్నారు. అవినీతికి తల ఒగ్గేది లేదని స్పష్టం చేశారు. మానేరు వాగును కాపాడుకుంటేనే భావితరాలకు ప్రకృతి సంపద లభిస్తుందని, లేకుంటే మానేరు గుల్ల అయి అందరికీ చెడ్డ పేరు వస్తుందని ఎమ్మెల్యే అన్నారు. ఇందుకోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే చేతులు జోడించి అభ్యర్థించారు. అంతకుముందు పలువురు ట్రాక్టర్ యజమానులు మాట్లాడి ఫ్రీ ఇసుక విధానం తీసుకువచ్చి ఎమ్మెల్యే విజయరమణ రావు అందరికీ న్యాయం చేశారన్నారు. ఇకముందు నుంచి అక్రమాలకు పాల్పడే వారి పట్ల ఎలాంటి చర్యలు తీసుకున్న తమకు అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో గంగయ్య, గనులు, భూగర్భ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్, సీఐ, తహసీల్దార్, ఎస్సై మరియు ట్రాక్టర్ యాజమానులు తదితరులు పాల్గొన్నారు.

# బంద్ విజయవంతం



**చందుర్తి, ప్రజానావ:** ఎస్సీ, ఎస్టీలను వర్గీకరిస్తూ సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా దేశంలోని అన్ని మాల మహానాడు ఇచ్చిన పిలుపు మేరకు నిర్వహించిన బంద్‌ను చందుర్తి మండలంలోని అన్ని గ్రామాల్లో విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులూ మాట్లాడుతూ వర్గీకరణ అనేది రాబోయే తరాలకు రిజర్వేషన్లు లేకుండా చేస్తుందన్నారు. అలాంటి వర్గీకరణ దేశంలోని ఎస్సీ, ఎస్టీ ప్రజలకు ప్రమాదకరమని, కేంద్ర ప్రభుత్వమైన బీజేపీ రాజ్యాంగాన్ని మార్చే కుట్రలో భాగమే వర్గీకరణ అంశమని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ముఖ్యంగా విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్రంగా ప్రభావం చూపుతుందని, అలాంటి నిర్ణయం సుప్రీంకోర్టు తీసుకోవడం బాధాకరమన్నారు. భారత దేశ వ్యవస్థలన్నీ రాజ్యాంగానికి లోబడి పని చేయాలని.. కానీ సుప్రీం కోర్టు రాజ్యాంగాన్ని పరిధి దాటి చేస్తున్న చర్యలను ఖండించారు. సుప్రీం ఇచ్చిన తీర్పు ను పునః సమీక్షించాలని డిమాండ్ చేశారు. ఇదే కొనసాగితే భవిష్యత్ లో ఉద్యమం తీవ్ర రూపం దాల్చుతుందన్నారు. అలాగే భారత్ బంద్ కు సహకరించిన మండలంలోని అన్ని గ్రామాల విద్యా సంస్థలు, వాణిజ్య వ్యాపార సంస్థలు , మరియు మండల ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల కమలాకర్, మండల అధ్యక్షులు నీరటి శ్రీనివాస్, మాల ఐక్యవేదిక మండల ఇన్‌చార్జి బత్తుల ఉదయ్, నాయకులు సంటి ప్రసాద్, మేడికాల తిరుపతి, పురుగుల సతీష్, బత్తుల జ్యోతి కుమార్, రాగుల రత్నం, మిత్ర యూత్ అధ్యక్షులు బత్తుల వంశీ, శాంతి యూత్ సభ్యులు మ్యాకల తిరుపతి, గొంటి మనోజ్, నవీన్, అంజయ్య, సుదర్శన్, చంటి, వాసు, యూత్ సభ్యులు, అన్ని గ్రామాల అధ్యక్షులు పాల్గొన్నారు.

**మాల మహానాడు ఆధ్వర్యంలో బంద్**

**కోనరావుపేట, ప్రజానావ:** రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండల కేంద్రంలో పాటు నిమ్మపల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో మాల మహానాడు ఆధ్వర్యంలో వర్గీకరణపై వ్యతిరేకంగా మాల మహానాడు నాయకులు బంద్ నిర్వహించారు. గ్రామలా లోని షాపులను , స్కూళ్లను నిర్వాహకులు,యజమానులతో మాట్లాడిమూసి వేయించారు. ఇట్టి కార్యక్రమంలో మాల మహానాడుమండల అధ్యక్షులు మందాల శ్రీనివాస్, నాయకులు బందెల సదానందం, సామల రమేష్, బండి సత్తయ్య, బందెల ధర్మపురి,ప్రభాకర్, అంగూరి సుధాకర్, మాదాసు భూమయ్య, నక్క పర్శరాములు,రమేష్, సురేష్, రాజశేఖర్, సదానందం, శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.



**అతడు అసంపూర్ణమైన మనిషి..**

ఈ నాటక ప్రపంచములో
రంగులన్నీ ముఖముమీద
రాయితగిలి గాయమైనట్టు
రాతలన్నీ నుదుటిమీదా..

ఈమట్టి.. మనిషికి వేదిక
నటించే సత్తాఉన్నా దేహమే నాటకము
నలుగురిలో ఒంటరిగా మిగిలే
ప్రయాణమె అతని గమ్యము..

అతడు తెరమీద వెన్నెల చెంద్రుడు
ఎదలోపల మరిగే సూర్యుడు
రాత్రిపగలు కళ్లల్లో కలలు
చేతినిండా విసిరేసిన వలలు..

అతడు అనుభవాలను నమ్ముకోడు..

మెదడును తొలిచే ఆలోచనలో
పక్షిలా ఎగురుతుంటాడు
మెరుపువిసిరే తాకిడికన్నా
వేగంగా విహారిస్తుంటాడు..

ఉదయమునుంచి రాత్రి వరకు
పరుగేత్తుతున్న గుర్రము అతడు..

కొమ్మకు పూలుపూసినట్టు మనసులో ఎక్కడ
మెత్తతనముండదు....
గాలికి ఆకురాలినట్టు
లోపల ఏ గలగలలుండవు..

అతడొక నీశ్శబ్ద చిత్రము..
ఉషాస్సులు...ఉద్యమాలకోసము
ఊపిరి బిగపట్టిన చైతన్యము.. ఉరుకులు
పరుగులతో ఎగసిపడుతున్నా
అలల సముద్రము.....

అతడు విశ్వప్రేమికుడు
కానీ,ఎవరిని ప్రేమించడు....
అతడు అనర్గళమైన మాటల శ్రామికుడు
కానీ,ఎవరితో మాట్లాడడు....

అతడు నడిచేదారిలో హోరుంటుంది
అతనిచూపుల్లో గడిచిన గతముంటుంది
అతని హృదయములో చెలించని
రక్తముంటుంది..
అతడే అసంపూర్ణమైన మనిషి..



– కృష్ణ మారుపాక(త్రిపుర సుందరి)
9059474032

# టాలెంట్‌కు వేదికగా సోషల్ మీడియా

## ఇమాన్వీ ఎంపికపై హను రాఘవపూడి




ప్రభాస్ కథానాయకుడిగా హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న పీరియాడికల్ యాక్షన్ డ్రామా కోసం కథానా యికగా సోషల్‌మీడియా స్టార్ ఇమాన్వీ ఎస్మాయిల్‌ను చిత్రబృం దం ఎంపిక చేసింది. ఈ సినిమాలో కథానాయికగా ఆమెను ఎంచుకోవడంపై దర్శకుడు హను రాఘవపూడి తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. సామాజిక మాధ్యమాల వల్ల కొత్త టాలెంట్‌ను వెతికి పట్టుకోవడం సులభ మైందన్నారు. ప్రస్తుతం ఉన్న రోజుల్లో కొత్త టాలెంట్‌ను వెలికితీయడంలో సామాజిక మాధ్యమాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. తమ కథకు అనుగు ణంగా నటీనటులను ఎంపిక చేసుకోవడంలో ఫిల్మ్‌మేకర్స్‌కు సోష ల్‌మీడియా ఎంతో సాయం చేస్తుంది. ఇమాన్వీ అందం, ప్రతిభ కలిగిన అమ్మాయి. అందరిలాగానే నేనూ ఆమె డ్యాన్స్ వీడియోలు చూస్తుంటా. ఆమె మంచి భరతనాట్యం డ్యాన్సర్. కళ్లతోనే ఎన్నో హావభావాలను పలికిస్తుంటుంది. అందుకే ఆమెకు ఒక అవకాశం ఇవ్వాలనుకున్నా అని హను చెప్పారు. ఆడిషన్స్, స్క్రీన్ టెస్ట్ అనంతరమే ఆమెను ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. ఆమెను సెలెక్ట్ చేయడం తన ఒక్కడి నిర్ణయం కాదని.. చిత్రబృందం మొత్తం నిర్ణయమని ఆయన తెలిపారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై ఇది నిర్మితం కానుంది. ఇటీవల ఈ సినిమా పూజా కార్యక్రమం జరిగింది. విభిన్నమైన కథ, భారీ బడ్జెట్‌తో తెరకెక్కనున్న ఈ చిత్రానికి 'ఫౌజీ' అనే టైటిల్ ప్రచారంలో ఉంది. ఇమాన్వీ విషయానికి వస్తే.. ఇన్‌స్టాగ్రామ్ స్టార్‌గా ఆమె యువతకు సుపరిచితురాలు. హిందీతో పాటు, తెలుగు, తమిళ పాటలకూ ఆమె వేసే స్టెప్‌లు ఎంతగానో అలరిస్తాయి. దాదాపు 7 లక్షల మంది ఆమెను ఫాలో అవుతున్నారు. ఈ సినిమా ప్రకటించిన తర్వాత ఆ సంఖ్య మరింత పెరిగింది.

# పుష్ప-2 పై ర్యూమర్స్ కంటిన్యూ...




ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం పుష్ప-2 క్రియేటివ్ దర్శకుడు సుకుమార్ తెరకెక్కిస్తున్నారు. పుష్పరాజ్‌గా మొదటిపార్ట్‌తో అల్లు అర్జున్ తన నటనతో, సుకుమార్ తన టేకింగ్‌తో ఎంతటి సన్సేషన్ సృష్టించారో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, యలమంచి రవిశంకర్‌లు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ దశలో వున్న ఈ చిత్రం నుంచి ఇప్పటి వరకు వచ్చిన రెండు సాంగ్స్ చార్ట్‌బస్టర్స్‌గా నిలిచాయి. అంతేకాదు ఈ సినిమా నుంచి వదిలిన ప్రతి ప్రమోషనల్ కంటెంట్‌కు కూడా అనూహ్య స్పందన వచ్చింది. మొదటగా ఈ చిత్రాన్ని ఆగస్టు 15న విడుదల చేద్దామనుకున్నారు. అయితే చిత్రీకరణ బ్యాలెన్స్, పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ పెండింగ్‌గా వుండటంతో డిసెంబర్ 6కు చిత్ర విడుదలను వాయిదా వేశారు. ఇక అప్పటి నుంచి ఈ చిత్రంపై పలు రూమర్స్ వస్తున్నాయి, అల్లు అర్జున్, సుకుమార్‌ల మధ్య గొడవలు, ఈ సినిమా మళ్లీ వాయిదా వేస్తారు. సమ్మర్‌కు రిలీజ్ చేశారు. ఇలా రకరకలా ఊహాగానలు ఈ చిత్రంపై వున్నాయి. అంతేకాదు మెగాస్టార్ ఫ్యామిలీకి, అల్లు ఫ్యామిలీకి మనస్పర్థలు వచ్చాయని అల్లు అర్జున్ తన ఫ్రెండ్ కోసం వైసీపీ అభ్యర్థిని సపోర్ట్ చేయడంతో బన్నీని మెగా క్యాంప్ దూరం పెట్టిందని ఇలా రకరకాల ప్రచారాలు వున్నాయి. అయితే ఇవన్నీ అసత్య ప్రచారాలన్నీ పలు సార్లు మెగాస్టార్ కాంపౌండ్, అల్లు ఫ్యామిలీ వాళ్లు చెప్పినా ప్రచారం ఆగట్లేదు.



# ఆదా శర్మ ఆస్తులు తెలిస్తే మైండ్ బ్లాంకే..

డైనమిక్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ దర్శకత్వం వహించిన హార్ట్ ఎటాక్ తో వెండితెరకు పరిచయమైంది హీరోయిన్ ఆదా శర్మ. నితిన్ హీరోగా నటించిన ఈ తో కుర్రాళ్లకు హార్ట్ ఎటాక్ తెప్పించింది ఈ బ్యూటీ. కానీ ఆ మూవీ బాక్సాఫీస్ వద్ద ఫ్లాప్ కావడంతో ఈ బ్యూటీకి ఆశించిన స్థాయిలో క్రేజ్ రాలేదు. ఆ తర్వాత పలు చిత్రాల్లో సెకండ్ హీరోయిన్‌గా కనిపించింది. కానీ బ్యూటీకి ఆశించిన స్థాయిలో ఆఫర్స్ రాలేదు. దీంతో బాలీవుడ్ షిఫ్ట్ అయ్యింది. ది కేరళ స్టోరీ తో పాన్ ఇండియా లెవల్లో ఒక్కసారిగా ఫేమస్ అయ్యింది. తన ల విషయంలోనే కాకుండా అనేక కారణాల వల్ల వార్తల్లో నిలుస్తోంది ఈ హీరోయిన్. కొన్ని నెలల క్రితం, దివంగత నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ ఇంటికి మారింది. ముంబైలో జన్మించిన ఆదా శర్మ ప్రాథమిక విద్యను అభ్యసించింది. నటి కావాలనే కోరికతో అదా కూడా చదువుపై పెద్దగా ఆసక్తి చూపలేదు. చదువు పూర్తయ్యాక నటి కావాలని అదా శర్మ తల్లిదండ్రులు ఆమెకు సలహా ఇచ్చారు. ఆదా శర్మ 12వ తరగతి వరకు మాత్రమే చదువుకుంది. ఆ తర్వాత నటనతో పాటు డ్యాన్స్ పాఠాలు కూడా తీసుకుంది. కథక్ నృత్యంలో శిక్షణ పొందింది. విక్రమ్ భట్ '1920'తో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టింది. తన మొదటి లోనే స్ట్రాంగ్ పెర్ఫార్మెన్స్ ఇచ్చింది. ప్రస్తుతం లేడీ ఓరియెంటెడ్ చిత్రాల్లో నటిస్తున్న ఆదా శర్మ ఇప్పటివరకు రూ.13 కోట్లకు పైగా ఆస్తులు సంపాదించుకుంది. లు, ప్రకటనలు మరియు సోషల్ నెట్‌వర్కింగ్ ద్వారా డబ్బు సంపాదిస్తుంది. షల్ మీడియాలో కూడా అదా యాక్టివ్‌గా ఉంటుంది. త్వరలో 'తుమ్కో మేరీ కసమ్'లో కనిపించనుంది.

# కథకు తగ్గ పాత్రను చేయడం ఇష్టం : శ్రీనిహ



చిత్రపరిశ్రమలో ఎంతో మంది ప్రతిభ కలిగిన నటీ నటులున్నారని, అలాంటి వారికి సినిమాల్లో అవకాశాలు రాకపోవడం ఎంతో బాధగా ఉందని యువ నటి శ్రీనిహ అన్నారు.'50-50' చిత్రంలో హీరోయిన్ చెల్లెలి పాత్ర ద్వారా తమిళ వెండితెరకు పరిచయమైన శ్రీనిహ 'ఆణ్ దేవతై', 'సైకో', హీరో సంతానం నటించి భారీ విజయాన్ని సొంతం చేసుకున్న 'ఇంగే నాంగ దాన్ కింగు' వంటి చిత్రాల్లో ముఖ్య పాత్రలు పోషించింది. ప్రస్తుతం '8 తోట్టాగల్' ఫేం వెట్రి, సీనియర్ నటుడు సత్యరాజ్ ప్రధాన పాత్ర లో తెరకెక్కుతున్న సస్పెన్స్ థ్రిల్లర్ జానర్ మూవీలో కీలక పాత్ర పోషిస్తుంది. హీరోయిన్‌గా నటించడానికి అన్ని రకాల అర్హతలున్నప్పటికీ ఆమెకు కేవలం చిన్నచిన్న పాత్రలకే పరిమితమైంది.

# లవ్ ఎట్ ఫస్ట్ సైట్

## - సమంత



నాగ చైతన్య, శోభిత ధూళిపాళ్ళ ఎంగేజ్‌మెంట్ తర్వాత.. అంతా ఎదురు చూసింది సమంత రియాక్షన్ కోసమే..! సోషల్ మీడియాలో ఆమె ఏదైనా పోస్ట్ చేస్తారేమో..? ఏదైనా అంటారేమో..? అంటూ తెగ వేతికారంతా. కానీ ఎక్కడా నోరు జారలేదు స్యామ్. చై నిశ్చితార్థం తర్వాత తొలిసారి మీడియా ముందుకొచ్చారీమె. మరి అక్కడేం జరిగింది..? సమంత రియాక్షన్ ఏంటి..? సమంత ఎప్పుడెప్పుడు బయటికి వస్తారా అని మీడియా వేచి చూస్తుంది. కానీ ఇక్కడ రాలేదు కానీ చాలా రోజుల తర్వాత ముంబైలో ప్రెస్ కాన్ఫరెన్స్‌కు వచ్చారు స్యామ్. వరల్డ్ పికిల్‌బాల్ లీగ్ అనే ఓ స్పోర్ట్స్ ఈవెంట్‌కు గెస్ట్‌గా వచ్చారు ఈ భామ. తన పర్సనల్ లైఫ్‌ను ఏ మాత్రం టచ్ చేయకుండా.. మిగిలిన విషయాలన్ని మాట్లాడేసారు స్యామ్. చైతూ నిశ్చితార్థం తర్వాత తొలిసారి మీడియా ముందుకు రావడం. దానికితోడు సమ్‌థింగ్ స్పెషల్ విషయం చెప్తానంటూ సోషల్ మీడియాలో ఊరించడంతో ఏదో పెద్ద విషయమే చెప్పబోతున్నారని ఊహించారంతా. కానీ ఏం లేదు.. సింపుల్‌గా వరల్డ్ పికిల్‌బాల్ లీగ్‌లో చెన్నై టీంను కొనుగోలు చేసారు సమంత. ఆ విషయాన్ని మీడియాతో పంచుకున్నారు. లవ్ ఎట్ ఫస్ట్ సైట్ అంటారు కదా.. నాకు పికిల్‌బాల్‌ను చూడగానే కలిగిన ఫీలింగ్ అదే అన్నారు సమంత. అందుకే దీన్ని ప్రమోట్ చేయాలనుకుంటున్నట్లు తెలిపారు. కేవలం స్పోర్ట్స్ గురించి మాత్రమే మాట్లాడి ప్రెస్ మీట్‌కి బైబై చెప్పారు స్యామ్. ప్రస్తుతం సిటాడెల్‌తో పాటు మమ్ముట్టితో ఓ , రక్త్ బ్రహ్మాండ్ అనే మరో సిరీస్‌కు కమిటయ్యారు సమంత.



## అదుపులోకి రాని బంగారం ధరలు

### యధావిధిగా ధరల పెరుగదల

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 21 :** దేశంలో బంగారం ధరలు దూసుకుపోతున్నాయి. పెరిగేప్పుడు తారాజువ్వలా పెరుగతూ..తగ్గినప్పుడు తాబేలు నడకలా తగ్గుతున్నాయి. మొత్తంగా ట్యాక్స్ తగ్గినప్పుడు అమాంతంగా తగ్గినట్లు తగ్గినా పెరుగుదల మాత్రం ఆగడం లేదు. దీంతో బంగారం సామాన్యులకు అందుబాటులో లేదనే చెప్పాలి. ఇప్పటికే 10 గ్రాముల 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ. 72వేలు దాటేసింది. అయితే గతకొన్ని రోజుల క్రితం తులం బంగారం ధర ఏకంగా రూ. 80 వేలమార్క్‌కు చేరువై దడ పుట్టిచ్చిన విషయం తెలిసిందే. ఒకానొక సమయంలో తులం బంగారం ధర రూ. లక్ష దాటడం ఖాయం అంటూ వార్తలు కూడా వచ్చాయి. అయితే దానికి భిన్నంగా బంగారం ధర క్రమంగా తగ్గుతూ వచ్చింది. ఈ క్రమంలోనే తాజాగా బుధవారం బంగారం ధరలో తగ్గుముఖం కనిపించింది. దేశంలోని దాదాపు అన్ని ప్రధాన నగరాల్లో గోల్డ్ రేట్ తగ్గింది. దేశరాజధాని ఢిల్లీలో మంగళవారం 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ ధర రూ. 66,7400కాగా, 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ. 72,790వద్ద కొనసాగుతోంది. దేశ ఆర్థిక రాజధాని ముంబయిలో 22 క్యారెట్ల తులం బంగారం ధర రూ. 66,590గా ఉండగా, 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ. 72,640 వద్ద కొనసాగుతోంది. ? ఇక చెన్నైలో ఈరోజు 22 క్యారెట్ల బంగారం ధర రూ. 66,590, 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ. 72,640గా ఉంది. బెంగళూరు విషయానికొస్తే ఇక్కడ 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 66,590గా ఉండగా, 24 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ ధర రూ. 72,640 వద్ద కొనసాగుతోంది. తెలుగు రాష్ట్రాల్లో బంగారం ధరల విషయానికొస్తే హైదరాబాద్‌లో 22 క్యారెట్ల తులం బంగారం ధర రూ. 66,590గా ఉండగా, 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ. 72, 640 వద్ద కొనసాగుతోంది. అలాగే విజయవాడతో పాటు విశాఖపట్నంలోనూను ఇవే ధరలు కొనసాగు తున్నాయి. ంగారం ధర తగ్గితే.. వెండి ధరలో మాత్రం పెరుగుదల కనిపించింది. బుధవారం కిలో వెండిపై రూ. 100 వరకు పెరిగింది. దీంతో దేశ రాజధాని ఢిల్లీతో పాటు.. కోల్‌కతా, జైపూర్ వంటి నగరాల్లో కిలో వెండి ధర రూ. 87,100గా ఉంది. ఇక ముంబయి, పుణెలో కూడా కిలో వెండి రూ. 87,100 వద్ద కొనసాగు తోంది. అయితే.. చెన్నైతోపాటు హైదరాబాద్, విజయవాడ, విశాఖలో కిలో వెండి ధర గరిష్టంగా రూ. 92,100 వద్ద కొనసాగుతోంది.

## 50లక్షల సభ్యత్వ నమోదు లక్ష్యం


### కదనరంగంలోకి దిగుతున్న బిజెపి గణం



**హైదరాబాద్, ప్రజానావ:** కేంద్రంలో మూడోసారి అధికారం దక్కించుకున్నాక సంస్థాగత ఎన్నికల పై బిజెపి నేతలు దృష్టి సారించారు. కమలం పార్టీలో సంస్థాగత సంగ్రామానికి సర్వం సిద్ధమైంది. దేశవ్యాప్తంగా సభ్యత్వ నమోదు కార్యక్రమంతో దీన్ని ప్రారంభించబోతున్నారు. ఇప్పటికే బీజేపీ సభ్యత్వ నమోదు అభియాన్‌పై ఢిల్లీలో వర్క్ షాప్ జరిగింది. సభ్యత్వ నమోదుపై శిక్షణ ఇచ్చారు. సభ్యత్వ నమోదు విధివిధానాలు పార్టీ నాయకత్వం ప్రకటించింది. బుధవారం తెలం గాణ రాష్ట్ర పార్టీ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు ప్రారంభం అయ్యింది. సభ్యత్వ నమోదుకు సంబంధించి తెలంగాణలో 12 మందితో ఓ కమిటీనీ కూడా నియమించారు. ఇందులో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శులతో పాటు పార్టీ ముఖ్య నేతలు ఉన్నారు. తెలంగాణలో సభ్యత్వాన్ని పెద్ద ఎత్తున నిర్వహించి సంస్థాగత కమిటీలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ డ్రైవ్‌ను సెప్టెంబర్ 1వ తేదీ నుంచి ప్రారంభించే అవకాశం ఉంది. సెప్టెంబర్ 1 నుండి సెప్టెంబర్ 25 వరకు మొ దటి విడత, అక్టోబర్ 1 నుంచి అక్టోబర్ 15 వరకు రెండో విడత సభ్యత్వ నమోదు నిర్వహిం చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక క్రియాశీల సభ్యత్వం నమోదును అక్టోబర్ 16 నుంచి అక్టోబర్ 31 వరకు ఉండే ఛాన్స్ ఉంది. నవం బర్ 1 నుంచి నవంబర్ 10 వరకు ప్రాథమిక, క్రియాశీల సభ్యత్వం రిజిస్టర్ తయారీ చేస్తారు. ఈసారి తెలంగాణలో దాదాపు 50 లక్షల సభ్యత్వం చేయించాలన్న లక్ష్యం దిశగా బీజేపీ ముందుకు వెళ్తోంది. మెంబర్ షిప్ డ్రైవ్ తర్వాత సంస్థాగత ఎన్నికల పక్రియ ప్రారంభం కానుం ది. కింది స్థాయి నుంచి పార్టీ అంతర్గత ఎన్నిక లు జరగనున్నాయి. బుత్ కమిటీ అధ్యక్షుల ఎన్నిక మొదట జరుగుతుంది. తర్వాత మండల కమిటీ, జిల్లా కమిటీ అధ్యక్షుల ఎన్నిక వరస క్రమంలో నిర్వహిస్తారు. ఆపై రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక డిసెంబర్?లో జరిగే అవకాశం కనిపి స్తోంది. దేశంలో సగానికిపైగా రాష్ట్రాల్లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుని ఎన్నిక పూర్తయితే జాతీయ అధ్యక్ష ఎన్నిక జరుగుతుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఎన్నికలు ఉన్న రాష్ట్రాలకు నేరు గానే అధ్యక్షుల ఎంపిక చేస్తున్న కమల అధినా యకత్వం.. మిగిలిన రాష్ట్రాలకు తొందరపడ కుండా ఎన్నిక పక్రియ ద్వారానే అధ్యక్షుల ఎంపిక పూర్తే చేసే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. లోక్ సభ ఎన్నికల తర్వాత బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి కిషన్ రెడ్డి రెండోసారి కేంద్ర మంత్రి కావడంతో ఆయన ప్లేస్?లో కొత్త అధ్య క్షుడు వస్తారని జోరుగా ప్రచారం సాగుతోంది. పలువురి పేర్లు కూడా రేసులో ముందున్నా యని. మరికొంత మంది పేర్లు కన్ఫర్మ్ అయ్యా యని వార్తలు చక్కర్లు కొట్టాయి. అవే పేర్లతో సంస్థాగత ఎన్నికల్లోనే కొత్త అధ్యక్షుని ఎన్నిక ఉంటుందని పార్టీనేతలు అంటున్నారు.

# వేగంగా విస్తరిస్తున్న మంకీపాక్స్

- దేశంలో అముందస్తు చర్యలకు దిగిన కేంద్రం
- కరోనా అంత ప్రమాదకారి కాదన్న ఆరోగ్య సంస్థ



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 21 :** మంకీపాక్స్ వేగంగా వ్యాపిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా వైరస్ ప్రబలుతోంది. పొరుగు దేశాల్లోనూ కేసులు నమోదవడంతో... కేంద్రం మరింత అప్రమత్తమైంది. దాయాది దేశం పాకిస్తాన్‌లో నాలుగు కేసులు నమోదయ్యాయి. అంతేకాదు.. పాక్ ఆక్రమిత కశ్మీర్ లోనూ ఒక ఎంపాక్స్ కేసు వెలుగుచూసింది. సౌదీ నుంచి పీఓకేకి వచ్చిన ఒక వ్యక్తిలో మంకీపాక్స్ లక్షణాలు కనిపించాయి. దీంతో.. కేంద్రం హైఅలర్ట్ ప్రకటించింది. ఎయిర్‌పోర్టులు, దేశ సరిహద్దుల్లో ముమ్మర తనిఖీలు చేపడుతోంది. ఎంపాక్స్‌పై ప్రపంచ ఆరోగ్య సంస్థ ఊరటనిచ్చే విషయం చెప్పింది. కోవిడ్‌లా... మంకీపాక్స్ ప్రమాదకర వైరస్ కాదని తెలిపింది. ఈ వైరస్ వ్యాపిని నియంత్రించే అవకాశాలు ఉన్నాయిని చెప్పింది. కోవిడ్ సమయంలో వ్యవహరించినట్టే.. ఎంపాక్స్ విషయంలోనూ అప్రమత్తంగా ఉంటే సరిపోతుందని.. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రకటించింది. ముందస్తు జాగ్రత్తలు తీసుకుని.. వైరస్ వ్యాప్తిని కట్టడి చేయగలిగితే.. ఎంపాక్స్‌ను కూడా తరిమేయొచ్చని చెప్పింది ప్రపంచ ఆరోగ్య సంస్థ. మంకీపాక్స్ లక్షణాలతో వచ్చే ప్రయాణికుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచిస్తోంది. దేశంలో ఎంపాక్స్ కేసులు బయటపడితే.. చికిత్స కోసం మూడు ఆస్పత్రులను నోడల్ వైద్య కేంద్రాలుగా ప్రకటించారు. వాటిలో ఢిల్లీలోని రామ్‌మనోహర్ లోహియా ఆస్పత్రి ఒకటి. రెండోది సఫ్దర్‌గంజ్ ఆస్పత్రి, మూడోది లేడీ హార్డింగ్ హాస్పిటల్. ఈ ఆస్పత్రుల్లో.. మంకీపాక్స్‌కు చికిత్స అందించనున్నారు. అందు కోసం ఐసోలేషన్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రాల్లోనూ నోడల్ కేంద్రాలను గుర్తించి... ఎంపాక్స్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని కేంద్రం సూచించింది. భారత్ దేశంలో గతంలో ఎంపాక్స్ కేసులు నమోదయ్యాయి. అయితే... ప్రపంచవ్యాప్తంగా వైరస్ ప్రబలుతున్న ఈ దశలో కొత్తగా ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. గత ఏడాది జులై నాటికి.. దేశంలో 27 మంకీపాక్స్ కేసులు ఉన్నాయని... పార్లమెంట్‌లో నాటి కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి సింగ్ బఘేల్ ప్రకటించారు. ఈ 24లో... 15 కేసులు ఢీల్లోలో... 12 కేసులు కేరళలో ఉన్నట్టు చెప్పారు. అయితే... ఇప్పుడు మళ్లీ వైరస్ విజృంభిస్తోంది. ఎంపాక్స్ ప్రమాదకరంగా మారిందని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది. ఈ క్రమంలో.. దేశంలో మళ్లీ ఎంపాక్స్ కేసులు విజృంభించే అవకాశాలు ఉన్నాయి. అందుకే కేంద్రం అలర్ట్ అయ్యింది. వ్యాధి లక్షణాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని... వైరస్‌ను ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన చర్యలపై ఫోకస్ పెట్టింది. దేశంలో వైరస్ వ్యాపి కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఎయిర్‌పోర్టుల్లో ప్రయాణికుల ట్రావెల్ హిస్టరీని నమోదు చేయడం చాలా అవసరం. ముఖ్యంగా.. ఎంపాక్స్ కేసులు ఎక్కువగా ఉన్న దేశాల నుంచి వచ్చే వారిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. వాళ్లలో ఎవరికైనా ఎంపాక్స్ లక్షణాలు అంటే... జ్వరం, ఒంటిపై దద్దర్లు వంటిని ఉన్నాయేమో టెస్ట్ చేయాలని. అందుకు.. ఎయిర్‌పోర్టుల్లో టెస్టింగ్ సెంటర్లు పెంచాలి. మంకీపాక్స్ సోకిన వాళ్లకు కనిపించే ముఖ్యమైన లక్ష్యం ఒంటిపై దద్దుర్లు. జ్వరం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, కండరాల నొప్పులు, వెన్నునొప్పి, మనిషి బలహీనపడటం, రోగ నిరోధక శక్తి తగ్గడం వంటివి ఉంటాయి. ఒంటిపై దద్దుర్లు పండుగా మారి... చీముతో నిండిన గాయంగా మారుతుంది.

పుండ్ల మానిపోయి కొత్త చర్మం ఏర్పడే వరకు.. ఈ వ్యాధి ఇతరకు వ్యాపించే అవకాశం ఉంటుంది. కొంతమందిలో ఒంటిపై దద్దుర్లు ముందుగా కనిపిస్తే... మరికొందరిలో మరో లక్ష్యం బయటపడుతుంది. వ్యాధి సోకిన వారికి సన్నిహితంగా ఉంటే... వారిలో వారం రోజుల్లో వైరస్ లక్షణాలు కనిపి స్తాయి. కొంతమందిలో 21 రోజుల్లో కూడా కనిపిం చవచ్చు. వైరస్ సోకిన తర్వాత రెండు నుంచి నాలుగు వారాల పాటు.. వ్యాధి లక్షణాలు ఉంటాయి.

## భక్త రామదాసు ధ్యానమందిరం ప్రారంభోత్సవం

### పర్యాటకంగా నేలకొండపల్లి అభివృద్ధి: మంత్రి పొంగులేటి



**ఖమ్మం, ప్రజానావ:** నేలకొండపల్లిని ప్రముఖ పర్యాటకంగా అభివృద్ధి చేయాలన్నదే తమ లక్ష్యమని రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజలకు భక్తరామదాసు గురించి తెలియజేయాలన్నదే ఇక్కడి వారి లక్ష్యమన్నారు. జిల్లాలోని నేలకొండపల్లి మండల కేంద్రంలోని భక్త రామదాస ధ్యాన మందిర ఆడిటోరియాన్ని శ్రీనివాస్ రెడ్డి బుధవారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ.. భక్తరామదాసు ఇక్కడే జన్మించారని..ఆయన జన్మస్థలాన్ని యావత్ ప్రపంచానికి తెలియజేయాలని అన్నారు. ఆడిటోరియం ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. మూడు కోట్ల రూపాయలతో ఆడిటోరియం నిర్మాణం చేసినట్లు చెప్పారు. ఇక్కడ ప్రశాంతత కనిపిస్తుందని.. బౌద్ధ స్థూపాన్ని పరిశీలించామన్నారు. ప్రపంచంలో మూడో అత్యంత పెద్ద బౌద్ధ స్తూపం నేలకొండపల్లిలో ఉందని తెలిపారు. ధ్యాన మందిరం ఎలా అభివృద్ధి చేయాలో నిపుణులతో చర్చిస్తామన్నారు. భక్తరామదాసు ప్రజల శ్రేయస్సు కోసం పని చేశారన్నారు. మార్పు రావాలని తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం తెచ్చుకున్నామన్నారు. శ్రీరామచంద్రునికి ఆలయం కట్టేందుకు భక్తరామదాసు ఎన్ని ఇబ్బందులు పడ్డారో తెలుసన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఎన్ని అవాంతరాలు ఎదురైనా ఇందిరమ్మ రాజ్యం పేదోళ్ల రాజ్యమని అన్నారు. భక్తరామదాసు ఈ ప్రభుత్వానికి ఆదర్శమని చెప్పుకొచ్చారు. ప్రజలకు చెప్పిన ప్రతి మాటను నెరవేరుస్తామని... అభివృద్ధి సంక్షేమం రెండూ చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.



## ప్రైవేట్ హాస్పిటల్‌ను సీజ్ చేసిన అధికారులు

**కామారెడ్డి, ప్రజానావ:** కామారెడ్డి జిల్లాలో బుధవారం నాడు పలు ప్రైవేట్ ఆస్పత్రులు లను అధికారులు సీజ్ చేశారు. ప్రైవేట్ ఆసుపత్రులు నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్నాయని, దీంతో ఆయా ప్రైవేట్ ఆస్పత్రులపై ప్రజలనుండి పలుమార్లు ఫిర్యాదులు రావడంతో కామా రెడ్డి జిల్లా ఆరోగ్యశాఖ అధికారులు బుధవారం లింగం పేటలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్ ను సీజ్ చేశారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ ఆస్పత్రులు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. ఆసుపత్రికి వెళ్తే చాలు ఈ టెస్టులు ఆ టెస్టులని వేల రూపాయలు గుంజుతు న్నారని ప్రజలు వాపోతున్నారు. జిల్లా కేంద్రంలో హైదరా బాద్ రోడ్ లో గల ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఇష్టానుసారంగా బిల్లులు వసూలు చేస్తున్నారు. 35 వేల రూపాయలు బిల్లు అయితే పేషెంట్ కు డిశ్చార్జ్ అయ్యేలోపు బిల్లు మాత్రం పదివేల రసీదు ఇస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఆరోగ్యశాఖ ఆసుపత్రి పై దృష్టి సారించి సామాన్య ప్రజలకు మెరుగైన వైద్యం అందించే ప్రయత్నం చేయాలని కామారెడ్డి ప్రజలు కోరుతున్నారు.

## వ్యాయామం చేస్తుండగా గుండెపోటు

### ఏఎస్ఐ దత్తాద్రి హఠాన్మరణం


**నిజామాబాద్, ప్రజానావ:** నిజామాబాద్‌లో ఏఎస్ఐ గుండెపోటుతో మృతిచెందారు. ఒకటో పట్టణ ఠాణాలో ఏఎస్‌గా పనిచేస్తున్న దత్తాద్రి (56) బుధవారం ఉదయం ఇంట్లో వ్యాయామం చేస్తుండగా కుప్పకూలిపోయారు. కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దత్తాద్రి గత రెండేళ్లుగా నిజామాబాద్ ఒకటో పట్టణ ఠాణాలో విధులు నిర్వహిస్తున్నారు. ఆర్మూర్ కు చెందిన ఆయన.. గత 20 ఏళ్లుగా నిజామాబాద్‌లోని గాయత్రి నగర్‌లో నివాసముంటున్నారు.

# నాదల్‌కు ఏమైంది?

- వరుస గాయాలతో సతమతమవుతున్న స్పెయిన్ బుల్
- చివరి అంకానికి చేరుకున్న కెరీర్?



**న్యూఢిల్లీ:** ఒకప్పుడూ ప్రపంచ టెన్నిస్‌లో ఎదురులేని శక్తిగా కొనసాగిన నాదల్ కొంతకాలంగా గాయాలతో సతమతమవుతున్నాడు. దీంతో స్పెయిన్ బుల్ రఫెల్ నాదల్ టెన్నిస్ కెరీర్ ముగిసినట్లేనని సర్వత్రా చర్చ జరగుతోంది. వరుస గాయాలతో సతమవుతున్న నాదల్ ఈ ఏడాది ఒకటి రెండు టోర్నమెంట్‌లలో మాత్రమే ఆడాడు. ఇటీవల ముగిసిన ఒలింపిక్స్‌లో నాదల్ స్పెయిన్‌కు ప్రాతినిథ్యం వహించాడు. అయితే ఒలింపిక్ పతకం సాధించడంలో మాత్రం నాదల్ విఫలమయ్యాడు. సింగిల్స్‌లో చిరకాల ప్రత్యర్థి నొవాక్ జకోవిచ్ (సెర్బియా) చేతిలో పరాజయం పాలయ్యాడు. పురుషుల డబుల్స్‌లో యువ సంచలనం అల్కరాజ్‌తో కలిసి బరిలోకి దిగినా ఫలితం లేకుండా పోయింది. గాయాలు నాదల్ కెరీర్‌పై బాగానే ప్రభావం చూపుతున్నాయి. మరోవైపు జకోవిచ్ వరుస గ్రాండ్‌స్లామ్ టైటిల్స్‌తో నాదల్‌ను వెనక్కినెట్టి అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. నాదల్ 22 గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్‌తో రెండో స్థానానికి పరిమితమయ్యాడు. నాదల్ మాత్రం రెండేళ్లుగా అంతర్జాతీయ టెన్నిస్‌కు దూరంగానే ఉంటున్నాడు. ఈ ఏడాది ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్ ఓపెన్‌కు దూరంగా ఉన్నాడు. తాజాగా యూఎస్ ఓపెన్‌లో పాల్గొనడం కూడా సందేహంగా మారింది. ఇలాంటి స్థితిలో నాదల్ ఇకపై అంతర్జాతీయ టెన్నిస్‌లో మళ్లీ పూర్వ వైభవం సాధించడం దాదాపు అసాధ్యంగానే కనిపిస్తోంది. స్పెయిన్‌కే చెందిన అల్కరాజ్ ప్రస్తుతం ప్రపంచ టెన్నిస్‌లో ఆధిపత్యం చెలాయిస్తున్నాడు. సెర్బియా యోధుడు జకోవిచ్‌కు గట్టిపోటీ ఇస్తూ అల్కరాజ్ ముందుకు దూసుకెళుతున్నాడు. ప్రస్తుతం జకోవిచ్, అల్కరాజ్‌ల మధ్యే పోటీ నెలకొంది. అలెగ్జాండర్ జ్వరేవ్, సిట్సిపాస్, బెర్రిటెని, హుర్కాజ్, రూనె, డానిల్ మెద్వెదేవ్ వంటి ఆటగాళ్లు నాదల్‌కు అందనంత ఎత్తులో నిలిచారు. వీరిని దాటుకుని నాదల్ ముందుకు సాగడం కష్టంతో కూడుకున్న అంశమనే చెప్పాలి. కొన్నేళ్ల వరకు ప్రపంచ టెన్నిస్‌లో నాదల్ ఎదురులేని శక్తిగా కొనసాగాడు. రోజర్ ఫెదరర్ (స్విట్జర్లాండ్), జకోవిచ్‌లతో కలిసి పురుషుల టెన్నిస్‌లో హవా కొనసాగించాడు. గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో ఈ ముగ్గురి మధ్యే పోటీ ఉండేదు. ఈ త్రయం పోటీ పడి గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ సాధించేది. కానీ వయసు పెరగడంతో స్విస్ దిగ్గజం ఫెదరర్ ఆటకు రిటైర్మెంట్ ప్రకటించక తప్పలేదు. అతను తప్పుకోవడంతో జకోవిచ్, నాదల్ మధ్య పోరు కొనసాగింది. ఒక దశలో నాదల్ చిరకాల ప్రత్యర్థి జకోవిచ్‌పై ఆధిపత్యం చెలాయించాడు. గ్రాండ్‌స్లామ్ చరిత్రలో అత్యధిక టైటిల్స్ సాధించిన ఆటగాడిగా నాదల్ నిలిచాడు. కానీ జకోవిచ్ పట్టు వదలకుండా పోరాడాడు. అసాధారణ పోరాట పటిమతో నాదల్‌ను వెనక్కినెట్టి అత్యధిక గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ గెలిచిన ఆటగాడిగా నయా చరిత్ర సృష్టించాడు.



### జకోను అందుకోవడం కష్టమే

ప్రస్తుతం జకోవిచ్ ఖాతాలో 24 గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ ఉన్నాయి. రెండో స్థానంలో ఉన్న నాదల్ ఇప్పటి వరకు 22 గ్రాండ్‌స్లామ్ ట్రోఫీలు సాధించాడు. నాదల్‌తో పోల్చితే జకోవిచ్ ఫిట్‌నెస్ విషయంలో చాలా మెరుగ్గా ఉన్నాడు. తాజాగా పారిస్ ఒలింపిక్స్‌లో స్వర్ణం సాధించడంతో ఆత్మవిశ్వాసం రెట్టింపు అయ్యింది. ఇలాంటి స్థితిలో జకోవిచ్ రానున్న రోజుల్లో మరిన్ని గ్రాండ్‌స్లామ్ టైటిల్స్‌ను సాధించే అవకాశాలు అధికంగా కనిపిస్తున్నాయి. ఇదే జరిగితే పురుషుల టెన్నిస్‌లో జకోవిచ్ రికార్డును అందుకోవడం నాదల్‌కు దాదాపు అసాధ్యమనే చెప్పాలి. ఇప్పటికే కెరీర్ చరమాంకంలో ఉన్న నాదల్ పూర్వవైభవం సాధించి మళ్లీ గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ సాధించడం శక్తికి మించిన పనిగానే విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు.



# హాకీ స్టార్ శ్రీజేశ్‌కు రూ.2కోట్ల నజరానా

**తిరువనంతపురం:** భారత హాకీ స్టార్, సీనియర్ గోల్ కీపర్ ఆర్‌పి శ్రీజేశ్‌కు భారీ నగదు పురస్కారం లభించింది. ఇటీవల పారిస్ వేదికగా జరిగిన ఒలింపిక్స్‌లో భారత పురుషుల హాకీ జట్టు కాంస్య పతకం సాధించిన సంగతి తెలిసిందే. భారత్ ఈ పతకం సాధించడంలో శ్రీజేశ్ కూడా చాలా కీలక పాత్ర పోషించాడు. దీంతో దేశ వ్యాప్తంగా శ్రీజేశ్‌పై ప్రశంసల వర్షం కురుస్తోంది. కాగా, ఒలింపిక్స్ ముగిసిన వెంటనే శ్రీజేశ్ హాకీకు రిటైర్మెంట్ ప్రకటించాడు. ఆ వెంటనే భారత హాకీ సమాఖ్య శ్రీజేశ్‌ను జూనియర్ టీమ్ ప్రధాన కోచ్‌గా నియమించింది. ఇదిలావుంటే భారత హాకీ ఎంతో విలువైన సేవలను అందించిన శ్రీజేశ్‌ను కేరళ ప్రభుత్వం భారీ నగదు బహుమతి ఇవ్వాలని నిర్ణయించింది. శ్రీజేశ్‌కు రెండు కోట్ల రూపాయల భారీ నగదు బహుమతిని ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. కేరళకు చెందిన శ్రీజేశ్ దాదాపు 20 ఏళ్ల పాటు భారత హాకీకి సేవలు అందించాడు. అతని ఖాతాలో రెండు ఒలింపిక్ పతకాలు ఉన్నాయి. అంతేగాక ఆసియా క్రీడల్లో రెండు స్వర్ణాలు సాధించిన భారత జట్టులో శ్రీజేశ్ సభ్యుడిగా ఉన్నాడు. భారత్‌కు లభించిన అత్యుత్తమ హాకీ ఆటగాళ్లలో శ్రీజేశ్ ఒకడిగా పేరు తెచ్చుకున్నాడు. ఇక అసాధారణ ఆటతో కేరళతో పాటు దేశ ఖ్యాతిని ఇనుమడింప చేసిన శ్రీజేశ్‌ను ఘనంగా సత్కరించాలని కేరళ ప్రభుత్వం నిర్ణయిచింది.

# ఈసారి బోర్డర్-గవాస్కర్ మాదే

- ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లోనూ విజయం సాధిస్తాం
- ఆస్ట్రేలియా పేసర్ మిచెల్ స్టార్క్

**మెల్‌బోర్న్:** భారత్‌తో జరిగే జరిగే ఐదు మ్యాచ్‌ల బోర్డర్–గవాస్కర్ టెస్టు సిరీస్‌లో ఈసారి తామే ట్రోఫీ సాధిస్తామనే నమ్మకాన్ని ఆస్ట్రేలియా స్టార్ ఫాస్ట్ బౌలర్ మిచెల్ స్టార్క్ జోస్యం చెప్పాడు. తమ సొంత గడ్డపై జరిగే ఈ ట్రోఫీలో ఎలాగైనా విజయం సాధించాలనే లక్షంతో ఉన్నామన్నాడు. గత రెండు సార్లు ట్రోఫీని తాము కోల్పోయామన్నాడు. కానీ ఈసారి ఎట్టి పరిస్థితుల్లోనూ దాన్ని చేజార్చుకునే ప్రసక్తే లేదన్నాడు. ఈ సిరీస్‌కు ఇంకా మూడు నెలల సమయం ఉందన్నాడు. అయితే తాము మాత్రం ఇప్పటి నుంచే సిరీస్‌పై దృష్టి పెట్టామన్నాడు. ప్రతి ఆటగాడు కూడా సిరీస్‌లో సత్తా చాటేందుకు సిద్ధంగా ఉన్నాడన్నాడు. దీని కోసం సర్వం ఒడ్డేందుకు సిద్ధమయ్యారన్నాడు. రెండు జట్లలోనూ ప్రతిభావంతులైన ఆటగాళ్లు ఉండడంతో సిరీస్ ఆసక్తికరంగా సాగడం ఖాయమన్నాడు. ఇక ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో కూడా తామే విజయం సాధిస్తామనే నమ్మకం ఉందన్నాడు. అయితే భారత్‌తో పోటీ ఎప్పుడూ సవాల్ వంటిదేనని స్టార్క్ అభిప్రాయపడ్డాడు. టీమిండియాను ఎదుర్కొవడం చాలా కష్టంతో కూడుకున్న అంశమన్నాడు. భారత్‌తో జరిగే ప్రతి సిరీస్ ఉత్కంఠభరితంగానే కొనసాగుతుందన్నాడు. ఈసారి కూడా సిరీస్ నువ్వానేనా అన్నట్టు జరగడం ఖాయమని స్టార్క్ పేర్కొన్నాడు.



# కోహ్లి అసాధారణ క్రికెటర్

- నేను మళ్లీ ఈ స్థితికి చేరుకోవడానికి ఆయనే కారణం
- భారత యువ బౌలర్ యశ్ దయాళ్

**ముంబై:** టీమిండియా క్రికెట్ దిగ్గజం విరాట్ కోహ్లిపై భారత యువ బౌలర్ యశ్ దయాళ్ ప్రశంసలు కురిపించాడు. విరాట్ ఓ అసాధారణ క్రికెటర్ అని కొనియాడాడు. కిందటి సీజన్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరుకు ప్రాతినిథ్యం వహించిన యశ్ దయాళ్‌లో ఆత్మస్థైర్యాన్ని నింపడంలో కోహ్లి కీలక పాత్ర పోషించాడు. 2023లో పేలవమైన ప్రదర్శనతో నిరాశ పరిచిన యశ్ ఆ తర్వాత బెంగళూరులో చేరి మెరుగైన ప్రదర్శనతో అలరించాడు. తాను ఈ స్థితికి చేరుకోవడానికి కోహ్లినే కారణమన్నాడు. తనలో ఆత్మవిశ్వాసాన్ని మళ్లీ గాడిలో పడేలా చేసిన ఘనత కోహ్లికే దక్కుతుందన్నాడు. యువ ఆటగాళ్లను ప్రోత్సహించడంలో కోహ్లికి ఎవరూ సాటిరారన్నాడు. ఎలాంటి పరిస్థితులోనైనా చెక్కు చెదరని ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లే సత్తా ఒక్క కోహ్లికి మాత్రమే ఉందన్నాడు. అతనితో కలిసి ఐపిఎల్‌లో ఆడడం తన కెరీర్‌ను మలుపు తిప్పిందన్నాడు. రానున్న రోజుల్లో మరింత మెరుగ్గా రాణించేందుకు కోహ్లి ఇచ్చిన సలహాలు, సూచనలు తనకు ఉపయోగ పడుతాయనే నమ్మకాన్ని యశ్ దయాళ్ వ్యక్తం చేశాడు.



WANTED

జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్ /
జిల్లా ఇంచార్జీలు కావలెను



కరీంనగర్, జగిత్యాల,
ఖమ్మం, భద్రాద్రి
కొత్తగూడెం,
జయశంకర్
భూపాలపల్లి,
జనగామ,
మహబూబాబాద్,
సంగారెడ్డి,
సూర్యాపేట,
జోగులాంబ గద్వాల

అనతికాలంలో తెలుగు రాష్ట్రాల్లో సంచలన కథనాలు అందిస్తూ విశేష ప్రజాదరణ పొందిన 'ప్రజానావ' తెలుగు దినపత్రిక లో పనిచేయుటకు అన్ని జిల్లాల నుంచి స్టాఫ్ రిపోర్టర్/జిల్లా ఇన్‌చార్జీలను ఆహ్వానిస్తోంది. అనుభవం, తెలుగు భాషపై పట్టు ఉన్న వారు.. ఆసక్తి గల వారు సంప్రదించవచ్చు.

సంప్రదించాల్సిన నెంబర్లు:
8185093931, 96766 67020,
72888 25681

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం

త్వరలో 'ప్రజానావ' సంస్థ ఆధ్వర్యంలో జర్నలిజం యందు శిక్షణ తరగతులు నిర్వహించబడును.

Printed, Published and Owned by Adula Thirupathi, Printed at Ramani Web Offset Printers, H.No 8-82/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, Published from 2-5-23, Mudhiraj street, Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. **Editor: Adula Thirupathi.** Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277. RNI NO: TELTEL/2023/87657